



ఒకే దఫాలో రూ.లక్ష రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ- కొండాపూర్

లక్ష రూపాయల రుణమాఫీని ఒకే దాపోలో చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గొల్లపల్లి జయరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ముందేంపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ముఖ్య రైతు సంఘం కార్యకర్తల సమావేశంలో జయరాజు మాట్లాడుతూ రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ నాలుగు విడతలలో చేస్తామని స్వయాన సీఎం కేసీఆర్ ప్రకటించారన్నారు. మొదట విడుదగా రూ.25 వేలలోపు రుణం ఉన్న 5.83 లక్షల మంది రైతులకు రూ.1.197 కోట్లు రుణమాఫీ చేశారన్నారు. రూ.50 వేల లోపు రుణమాఫీకి ప్రభుత్వం నిధులు జమ చేసిందన్నారు. మిగిలిన విడతలను ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. లక్ష ఉన్న రైతుల రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కూరాకుల రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు యాదవ రెడ్డి, రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, గోపాల్, విష్ణు, చంద్రయ్య, మామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్ టూ ఇస్నాపూర్ మెట్రోకు మోక్షం

- మంత్రివర్గం నిర్ణయంతో జిల్లాలో హర్షాతిరేకలు • సంగారెడ్డి వరకు పొడగించాలి: సీపీఐ(ఎం)
- గతంలో అనేక రూపాల్లో పోరాటాలు • 2021లో పటాన్‌చెరు టూ సంగారెడ్డికి మహా పాదయాత్ర
- మంత్రులు, కలెక్టర్, సీఎంకు వినతి • సంగారెడ్డి పట్టణీకరణకు మెట్రో దోహదం



ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న మెట్రో లైన్ విస్తరణకు మోక్షం లభించింది. మియాపూర్ టూ ఇస్నాపూర్ వరకు మెట్రో పరుగులు పెట్టే అవకాశం ఏర్పడింది. హైదరాబాద్ నలుదిశలా మెట్రో రైళ్లను పరుగులు పెట్టేందుకు అవసరమైన కొత్తలైన్ల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాల్ని తీసుకున్నారు. సంగారెడ్డి జిల్లా పారిశ్రామికంగా వ్యాపారపరంగా శరవేగంగా అభివృద్ధి చెందుతుంది. ఆ మేరకు రవాణా అవసరాలు కూడా పెరిగాయి. పెరిగిన ప్రజల అసవరాల మేరకు మెట్రోలైన్‌ను మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు విస్తరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐఎం గతంలో అనేక పోరాటాలు చేసింది. 2021లో మహా పాదయాత్ర, కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేసింది. సీఎం, మంత్రులు, కలెక్టర్లకు వినతి పత్రాలివ్వడం ద్వారా ప్రభుత్వంపై వత్తిడి పెంచింది. ప్రజా పోరాటాల ఫలితంగా ఇస్నాపూర్ వరకు మెట్రోలైన్ విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

సంగారెడ్డి జిల్లాలో వేలాది పరిశ్రమలొచ్చాయి. నిర్మాణ రంగం పుంజుకుంది. రియల్ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. లింగంపల్లి నుంచి సంగారెడ్డి జిల్లా ప్రారంభమవుతోంది. పటాన్‌చెరు, సంగారెడ్డి, జహీరాబాద్, అందోల్, నారాయణఖేడ్ నియోజకవర్గాల్లో పరిశ్రమలు విస్తరించాయి. ముంబయి, నాందేడ్ రెండు ప్రధాన రహదారులున్నాయి. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి నిత్యం వేలాది వాహనాలు నడుస్తున్నాయి. నిత్యం రెండు రహదారులు కూడా రద్దీగా ఉంటున్నాయి. జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్‌తో పాటు అనేక పరిశ్రమలు, నిర్మాణాలు ఉండడంతో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగాయి. కందిలో ఐఐటీ హైదరాబాద్ ఉంది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన విద్యార్థులే కాకుండా విదేశీ విద్యార్థులు చదువుకుంటున్నారు. జేఎన్‌టీయూ క్యాంపస్ సుల్తాన్‌పూర్‌లో ఉంది. సంగారెడ్డి జిల్లాలో ఒక ప్రభుత్వ మెడికల్ కళాశాలతో పాటు రెండు ప్రయివేట్ మెడికల్ కళాశాలున్నాయి. గీతం యూనివర్సిటీ కూడా ఉంది. విద్య, వైద్య రంగాల్లో అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తుండడంతో నిత్యం ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఐదు ఇంటర్నేషనల్ స్కూల్స్ ఉన్నాయి. పటాన్‌చెరు, ఇస్నాపూర్, సంగారెడ్డి, బొల్లారం, పాశమైలారం, గుమ్మడిదల ప్రాంతాల్లో వేలాది పరిశ్రమలున్నాయి. అదే విధంగా హైదరాబాద్ శివారు జిల్లా కావడంతో ఇస్నాపూర్ వరకు హైదరాబాద్‌లో కలిసిపోవడంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. రెండు .జాతీయ రహదారులున్నప్పటికీ కంది నుంచి మియాపూర్ వరకు ఒకటే రెండో కావడంతో భారీ, ఇతర వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. బస్సులు, ద్విచక్రవాహనాల్లో ప్రయణాలు కష్టంగా మారాయి. ట్రాఫిక్ ఇబ్బందులతో అధిక సమయం ప్రయాణానికే పోతుండడంతో ఇబ్బందులేర్పడు తున్నాయి. మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రోలైన్ విస్తరిస్తే రవాణా సదుపాయం మెరుగవ్వడమే కాకుండా రద్దీ సమస్య ఉండదు. ఐటెక్ సిటీ, మాదాపూర్, గచ్చిబౌళి ఐటీ కారిడార్‌లో ఐటీ ఉద్యోగాలు, సంగారెడ్డి ప్రాంతంలో పారిశ్రామిక రంగంలో ఉద్యోగాలు చేసే వారు, విద్య వైద్య అవసరాలకు వెళ్లేవాళ్లకు మెట్రో ప్రయాణం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తక్కువ సమయంలో సౌకర్యంగా గమ్యం చేరుకునేందుకు వీలుంది.

మియాపూర్-ఇస్నాపూర్‌కు మెట్రో

రాష్ట్ర ప్రభుత్వం మెట్రోలైన్ విస్తరణకు పూనుకుంది. మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు మెట్రోలైన్ విస్తరించేందుకు నిధులు మంజూరు చేస్తూ మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్‌ను కలుపేలా మెట్రోలైన్‌ను శివారు ప్రాంతాలకూ విస్తరించాలని ప్రకటించింది. మియాపూర్ వరకు మెట్రోలైన్ ఉంది. అక్కడి నుంచి లింగంపల్లి, బీహెచ్ఈఎల్, అమీన్‌పూర్, పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రోలైన్ వేయనున్నట్లు మంత్రి కేటీఆర్ ప్రకటించారు. ఫేజ్-3 కింద రూ.60 వేల కోట్ల వ్యయంతో 278 కిలో మీటర్ల మేర మెట్రోలైన్‌ను విస్తరించనున్నారు. అందులో భాగంగా మియాపూర్ నుంచి ఇస్నాపూర్ వరకు కూడా మెట్రోలైన్ వేయనున్నారు. ఎమ్మెల్యే జగ్గారెడ్డి కూడా మెట్రో విస్తరించాలని అసెంబ్లీలో ప్రస్తావించారు.

మెట్రో విస్తరణ కోసం పోరాడిన సీపీఐ(ఎం)

పెరుగుతున్న రవాణా అవసరాల మేరకు మెట్రోలైన్‌ను మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు విస్తరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) అనేక పోరాటాలు చేసింది. 2021 మార్చిలో పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, రాష్ట్ర నాయకులు జె.మల్లికార్జున్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బీరం మల్లేశం, అతిమేల మాణిక్, కె.రాజయ్య, రామచంద్రం, జి.సాయిలు, నర్సింహారెడ్డి తదితర నాయకులు పాదయాత్ర చేశారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి హరీశ్‌రావులకు వినతిపత్రం ఇచ్చారు. కలెక్టర్ల ద్వారా ప్రభుత్వానికి తెలియజేశారు. పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం ఇస్నాపూర్ వరకు మెట్రోను విస్తరించేందుకు పూనుకుంది. ఇస్నాపూర్ వరకు మెట్రో విస్తరణ చేయడం పట్ల సీపీఐ(ఎం) హర్షం వ్యక్తం చేసింది. సంగారెడ్డి వరకు కూడా విస్తరించాలని కోరుతుంది.

పోరాటాల ఫలితమే



ప్రజా పోరాటాల ఫలితంగానే ఇస్నాపూర్ వరకు మెట్రోలైన్ విస్తరణకు ప్రభుత్వం నిర్ణయించింది. సీపీఐ(ఎం) మహా పాదయాత్ర ద్వారా మెట్రో సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయాం. ఆ తర్వాత అనేక రూపాల్లో ఆందోళనలు చేశాం. సీఎం, మంత్రులు జిల్లాలో పర్యటించిన సందర్భంగా సీపీఐ(ఎం) ప్రతినిధులం కలిసి వినతి పత్రాలిచ్చాం. మెట్రో అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్ అండ్ బీ అధికారుల ద్వారా ప్రయత్నించాం. ఇస్నాపూర్‌తో పాటు సంగారెడ్డి వరకు మెట్రోను వేయాలి.

- గొల్లపల్లి జయరాజ్, సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి

ప్రజల పక్షాన నవతెలంగాణ

మెదక్ రీజియన్‌లో 8వ వార్షికోత్సవ వేడుక

నవతెలంగాణ-సంగారెడ్డి



అనుదినం-జనస్వరం నినాదంతో నవతెలంగాణ దినపత్రిక ప్రజల పక్షాన నిలబడుతుందని మెదక్ రీజియన్ మేనేజర్ రేవంత్‌కుమార్ అన్నారు. నవతెలంగాణ 8వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం సుందరయ్య భవన్‌లో కేక్ కట్ చేసి వేడుక నిర్వహించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి వారసత్వాన్ని పునికిపుచ్చుకున్న నవతెలంగాణ నిరంతరం ప్రజల కోసం పనిచేస్తుందన్నారు. పత్రిక నిర్వహణలో వివిద స్థాయిలో పనిచేస్తున్న సిబ్బంది, రిపోర్టర్లకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలోల మెదక్ రీజియన్ డెస్క్ ఇంచార్జీ హనుమకొండ జంగయ్య, మెదక్ ప్రాంతీయ ప్రతినిధి మేకల కృష్ణయ్య, సబ్ ఎడిటర్ చందు, ఎడీవీటి సంగారెడ్డి ఇంచార్జి శ్రీనివాస్, మానస, రజిత, రిపోర్టర్లు మహబూబ్ అలీ, సుదర్శన్‌రెడ్డి, వాసు, రవీందర్, దాసయ్య, సిద్దు, బాలరాజు, చిరంజీవి, శంకర్, సంగ్రాహం, ఎల్లయ్య, శ్రీనివాస్, వీరేశం, నివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల అభివృద్ధి

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

నవతెలంగాణ కొండపాక



కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలన లోనే పేదల అభివృద్ధి జరుగుతుందని డిసిసి అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే తుంకుంట నర్సారెడ్డి అన్నారు మంగళవారం కుకునూరు పల్లి మండలం బొబ్బాయిపల్లి, ముద్దాపూర్ గ్రామాల్లో ఆత్మగౌరవ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బిఆర్ఎస్ పాలనలో అవినీతి పెరిగింది. అవినీతి పెరిగిందే తప్ప పేదల బతుకులు మారలేదు అన్నారు. పాలన అంతా కొంతమంది చేతుల్లోనే ఉందన్నారు. వచ్చేది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమని తమ పార్టీ అధికారంలోకి రాగానే ప్రజల కష్టాలన్నీ తీరుస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విరుపాక శ్రీనివాస్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ నరసింహ చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

ఈత వనాల పెంపకంతో జీవానోపాధి

నవతెలంగాణ-బెజ్జంకి



ఈత వనాల పెంపకంతో గ్రామంలోని గౌడ కులస్తుల జీవానోపాధి మెరుగు పడుతుందని హుస్నాబాద్ డివిజన్ అబ్కారీ శాఖ సీఐ దామోదర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దాచారం గ్రామంలో సర్పంచ్ పెంటమీడీ శ్రీనివాస్,వార్డ్ సభ్యులు,గౌడ కులస్తులతో కలిసి సీఐ దామోదర్ ఈత మొక్కలు నాటారు.గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు,గౌడ కులస్తులు పరస్పర సహకారంతో నాటిన ఈత మొక్కలను సంరక్షించాలని సీఐ సూచించారు.ఈత మొక్కల పెంపకానికి కృషిచేసిన సర్పంచ్ శ్రీనివాస్ ను సీఐ అభినందించారు.అబ్కారీ శాఖాధికారులు సాయి క్రిష్ణ,పంచాయతీ కార్యదర్శి సురేశ్,గౌడ కులస్తులు పాల్గొన్నారు.

సర్వీస్ రూల్స్ సవరించాలి

- ఎన్‌పీఆర్డీ రాష్ట్ర కార్యదర్శి ఎం అడివయ్య

నవతెలంగాణ - మెదక్



ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో వికలాంగుల రోస్టర్ 10లోపు తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర, సబార్డినేట్ సర్వీస్ రూల్స్1996 సవరించాలని, ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని ఎన్ పిఆర్డి రాష్ట్ర కార్యదర్శి ఏం అడివయ్య హెచ్చరించారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్లో వికలాంగు హక్కుల జాతీయ వేదిక మెదక్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నియామకల్లో శారీరక వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని విమర్శించారు. వికలాంగుల రోస్టర్ 10 లోపు తగ్గించేందుకు తెలంగాణ రాష్ట్ర సబార్డినేట్ సర్వీస్ రూల్స్ 1996 సవరించాలని డిమాండ్ చేశారు. పబ్లిక్ సర్వీస్ డిపార్ట్మెంట్ ఫర్ చిల్డ్రన్ డిజేబుల్ అండ్ సీనియర్ సిటిజన్ శాఖ జారీ చేసిన జీవో నెంబర్ 10 లో రోస్టర్ పాయింట్లు అంధులకు 6, మూగ చెవిటి వారికి 31, శరీరక వికలాంగులకు 56, ఆటిజం, మానసిక వికలాంగులు 82 ప్రకారం ఉద్యోగాలు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నిర్ణయం ప్రకారం శారీరక వికలాంగులకు ఆటిజం, మానసిక వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్టేట్ సబర్డినెట్ సర్వీస్ రూల్స్ కు సవరణ చేసి శారీరక వికలాంగులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు ఉచిత విద్యుత్, ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మరగుజ్జు వికలాంగులకు ఆర్టీసి రాయితీ బస్సు పాసులు ఇవ్వాలని గతంలో ఆర్టీసి అధికారులు సర్క్యులర్ విడుదల చేశారని, దాన్ని అమలు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన యూనిక్ డిసెబుల్డ్ గుర్తింపు కార్డును ప్రభుత్వ పథకాలకు వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. పర్యాటక కేంద్రాల్లో వికలాంగులకు ఉచిత ప్రవేశం సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడుస్తున్న మెట్రో రైలులో వికలాంగులకు ఉచిత పాసులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. నామినేటెడ్ పదవులలో వికలాంగులకు రిజర్వేషన్స్ అమలు చేయడానికి వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే స్టేషన్స్, ఆర్టీసి బస్సు స్టేషన్లులు అవరోధ రహితంగా మార్చాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కులాల వారిగా సంక్షేమ పథకాలు ప్రకటిస్తుందని, అత్యంత పేదరికంలో ఉన్న వికలాంగుల కోసం ప్రత్యేకంగా పథకాలు ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. నిరుద్యోగ వికలాంగులకు 10 లక్షల వరకు ఆర్థిక సహాయం చేస్తామని గతంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, దాన్ని ఎందుకు అమలు చేయడం లేదన్నారు. కేవలం రూ. 50 వేలు మాత్రమే స్వయం ఉపాధి కోసం వికలాంగులకు చెల్లిస్తున్నారన్నారు.

వికలాంగులకు సాధికారత, సమగ్ర అభివృద్ధి కోసం 10 లక్షలతో వికలాంగుల బంధు పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాపిత ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు యశోద, జిల్లా గౌరవ అధ్యక్షులు బస్వరాజు, జిల్లా అధ్యక్షులు కె యశోద, జిల్లా కార్యదర్శి నాగరాజు, జిల్లా నాయకులు కవిత, దుర్గ, శ్రీనివాస్, యాదగిరి, కిష్టయ్య, సమెంధర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 7న కలెక్టరేట్ వద్ద ధర్నా

ఎన్పీఆర్ డి డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోచయ్య, మల్లేశం

నవతెలంగాణ జోగిపేట



వికలాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, ఆగస్టు 7న జిల్లా కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని వికాలాంగుల హక్కుల జాతీయ వేదిక అందోల్ డివిజన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పోచయ్య, మల్లేశం తెలిపారు. మంగళవారం వారు జోగిపేటలో ధర్నాకు సంబంధించిన కరపత్రం విడుదల చేశారు. వికలాంగుల శాఖలో అవినీతిపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. దళిత బంధు పథకంలో అన్ని నియోజకవర్గాల్లోని వికలాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కచ్చితంగా కల్పించాలన్నారు. బ్యాంకు రుణాలు, వివాహ ప్రోత్సాహకం కోసం దరఖాస్తులు చేసుకుంటే, మంజూరి అయిన వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని వారు అన్నారు. డబ్బులు ఇవ్వకపోతే అనర్హులుగా ప్రకటిస్తున్నారన్నారు. వికలాంగుల శాఖ అవినీతిపై చేపట్టే ధర్నాను జిల్లాలోని వికలాంగుల అందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. వికలాంగుల సంఘం నాయకులు కుమార్, చెన్నయ్య, రాజు, కిష్టయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో గొల్ల కురుమల కాలనీ

నవ తెలంగాణ వట్‌పల్లి



మండలంలోని బిజిలీపూర్ గ్రామంలోని గొల్ల కురుమ కాలనీలో మూడు నెలలుగా వీధి దీపాలను విద్యుత్ స్తంభాలకు అమర్చకపోవడంతో అంధకారం నెలకొంది. పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కాలనీ గుండా వరద ప్రవహిస్తుండటంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద ప్రవాహానికి పాములు తేళ్లు ఇండ్ల లోనికి చేరుకోవడంతో ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకుని కంటిమీద కునుకు లేకుండా నిద్ర హారాలు మాని ప్రాణాలను కాపాడుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటోందని పేర్కొంటున్నారు. మూడు నెలలుగా కాలనీవాసులు చిమ్మ చీకట్లోనే మగ్గుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోతున్నారు. విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలను అమర్చి కాలనీలో వెలుగులు నింపాలని కోరుతున్నారు. ఈ సందర్భంగా గొల్ల కురుమ కాలనీ నర్సింలు మాట్లాడుతూ మూడు నెలలుగా వీధి దీపాలు లేక కాలనీవాసులు చీకట్లో దారి తెలియక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సమస్యను కార్యదర్శి, సర్పంచ్ దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పేదల హక్కుల కోసం పోరాటాలే కామ్రేడ్ కృష్ణమూర్తికి నివాళి

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్ళబండి శశిధర్

నవ తెలంగాణ సిద్దిపేట అర్బన్



తెలంగాణ సాయుధ పోరాట యోధుడు వ్యవసాయ కార్మిక సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ కాచం కృష్ణమూర్తి వర్ధంతి సందర్భంగా సిద్దిపేట జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మంగళవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి రాళ్ళబండి శశిధర్ మాట్లాడుతూ అమరజీవి కాచం కృష్ణమూర్తి కష్ట జీవుల హక్కుల కోసం, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుండి విముక్తి కోసం ప్రారంభమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట ఉద్యమం అంచెలంచెలుగా ఎదిగి నిజాం నిరంకుశ రాజరికాన్ని అంతం చేసి, భూస్వాముల నుండి 10 లక్షల ఎకరాలభూమి స్వాధీనం చేసుకుని భూమిలేని పేదలకు పంచడం జరిగిందని అన్నారు. 3 వేల గ్రామాల విముక్తి చేసి ప్రజారాజ్యాలను ఏర్పాటు చేశారన్నారు. పేద ప్రజల హక్కుల కోసం, కూలి, భూమి పోరాటాలే వారికి నిజమైన నివాళి అని అన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు చొప్పరి రవికుమార్,ఎస్. చెంద్రారెడ్డి,ఐద్వా నాయకులు నవీన,శిరీష, కోండం సంజీవ్,వంగ రవీందర్ రెడ్డి,రాజనర్సు,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మేడారం వరద బాధితులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ప్రజ్ఞాపూర్



ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో జనజీవనం స్తంభించి పోయిందని ఆపన్నహస్త మిత్ర బృందం గజ్వేల్ అధ్యక్షులు పాషికంటి బాల్ చంద్రం అన్నారు. మంగళవారం ములుగు, జిల్లా మేడారం కల్వపల్లి, కొండాయి, ప్రాజెక్ట్ నగర్ గ్రామాల్లో సందర్శించారు. ఈ సహాయాన్ని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు అందజేశారు.బిక్కుబిక్కుమంటున్న బాధితులకు గజ్వేల్ ఆపన్న హస్త బృందం ముందుకు రావడం సంతోషకరమని ములుగు ఎమ్మెల్యే సీతక్క వారిని అభినందించారు. వారి గ్రామాలకు చేరుకునేందుకు ఒకే ఒక పెద్ద బ్రిడ్జ్ ఉందన్నారు. అది కూలిపోవడం చూసి ఆశ్చర్యం అనిపించిందన్నారు. ఇంత పెద్ద వరదనాబోటు తో కాల్వ దాటి వెళ్లి చూసేసరికి ముంపు గ్రామాల ప్రజల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. వారు అన్నమో రామచంద్ర అంటూ బిక్కు బిక్కుమని ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అక్కడ మేమే కాదు ఇంకా చాలా స్వచ్ఛంద సంస్థలు చాలా రకాలుగా హెల్ప్ చేస్తున్నాయన్నారు.కానీ వారి ఆకలి తీర్చలేమేమో అనుకున్నమని, శక్తి మేరకు ఒక లక్ష రూపాయల బడ్జెట్ తో ఒక 70 కుటుంబాలకు సహాయాన్ని అందించమన్నారు. బియ్యం, కిరాణం, బట్టలు, బ్లాంకెట్, పండ్లు బిస్కెట్స్ వస్తువులు సర్వం కోల్పోయి కష్టాల్లో సహాయం కోసం ఎదురు చూస్తున్న గ్రామ ప్రజలకు మానవతా దృక్పథంతో సహాయాన్ని చేశామన్నారు. వారి గ్రామాలకు వెళ్లి కుటుంబాలను సందర్శించి వారికి అందివ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కటుకం శ్రీనివాస్, కోషాధి కారి కొల్లూరి శ్యామ్ ప్రసాద్, ఉపాధ్యక్షులు మంగళి సాయి, సహాయ కార్యదర్శి కొలిచెల్మే స్వామి, సభ్యులు రాజు, హనుమాన్ దాస్, సత్యనారాయణ అనిల్, నర్సింలు, కోటిలింగం, కిష్టయ్య, వెంకటేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ హరికిషన్ సింగ్‌సూర్జిత్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

నవతెలంగాణసిద్దిపేట అర్బన్



స్వాతంత్ర్య సమరయోధుడు, సీపీఐ(ఎం) అఖిల భారత మాజీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మిస్తామని సీపీఐ(ఎం) సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అన్నారు. మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో హరికిషన్‌సింగ్ సూర్జిత్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ కామ్రేడ్ హరికిషన్ సింగ్ సూర్జిత్ తన 12వ ఏట నుండి స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్య భూమిక పోషించారని తెలిపారు. బ్రిటిష్ పాలలకు వ్యతిరేకంగా పోరాటం చేసి లాటి దెబ్బలు, బుల్లెట్లు మోతల మధ్య బ్రిటిష్ వాడి జెండాను తొలగించి జాతీయ జెండాని ఎగరేసిన ధీరుడు హరికిషన్ సింగ్ సూర్జిత్ అని అన్నారు. ఆయన 1934లో కమ్యూనిస్టు పార్టీలో చేరారని, పంజాబ్ రాష్ట్ర కిసాన్ సభ కార్యదర్శి ఎన్నికయ్యారని గుర్తు చేశారు. 10 సంవత్సరాల పాటు జైలు జీవితం గడిపారన్నారు. కమ్యూనిస్టు పార్టీ ఇండియా మార్క్సిస్టు సిపిఎం ఆవిర్భవించిన తొలి నాల్లలో నవరత్నాల్లో ఒకరిగా ఉన్నారని తెలిపారు. పార్టీ అఖిలభారత ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగారన్నారు. తన ఊపిరి ఉన్నంత కాలం ప్రజా జీవితానికి అంకితమై నిరాడంబరంతో అంకితభావంతో అహర్నిశలు పార్టీ కోసం ప్రజల కోసం పరితపించారని అన్నారు. అలాంటి మహనీయుడి త్యాగస్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, సింగిరెడ్డి నవీన, జిల్లా నాయకులు జాలిగాపు శిరీష, కొండం సంజీవ్ కుమార్, వంగ రవీందర్ రెడ్డి, రాయ నర్సు, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అన్ని రంగాలలో రాణింపు

ఎమ్మెల్సీ డా.యాదవరెడ్డి



నవతెలంగాణ-మర్కుక్: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన విద్యార్థులే ఉన్నతమైన స్థానంలో ఉన్నారని, అన్నిరంగాలలో రాణిస్తారని ఎమ్మెల్సీ డా. వంటేరు యాదవ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చేబర్తి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరు రాందాస్ గౌడ్, సౌజన్యంతో ఇంగ్లీష్ మీడియం పాఠ్య పుస్తకాలను ఉచితంగా మర్కుక్ జెడ్పిటిసి యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్, వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డి, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మర్కుక్ కరుణాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ అశోక్ తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని, ఆరు సంవత్సరాలుగా ఒకటి రెండవ తరగతి విద్యార్థులకు ఉచితంగా ఇంగ్లీష్ మీడియం పాఠ్యపుస్తకాలను అందిస్తున్న వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాందాస్ గౌడ్ ను అభినందనీయన్నారు. కెసిఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం లో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయని కెసిఆర్ ప్రవేశపెట్టిన మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల చదువుకునే పేద విద్యార్థులకు పాఠశాలలలో మౌలిక వసతులు కల్పన గణనీయంగా సమకూర్చడం జరుగుతుందన్నారు. విద్యార్థులు బాల్యంలో నేర్చుకునే విద్యనే మీ భవిష్యత్తును తీర్చిదిద్దడానికి పునాదన్నారు. కాలను విద్యార్థులకు అందజేశారు. సిఎం కెసిఆర్ ప్రభుత్వంలోనే విద్యా శాఖలో అనేక మార్పులు తీసుకొచ్చి మన ఊరు మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించి గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తున్నారు. రాష్ట్రంలో 1000 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు నాణ్యమై విద్యను అందిస్తున్నారు. మర్కుక్ మండల ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ పాఠశాలల చదువకునే పేద విద్యార్థుల అభివృద్ధి కి ముందు వరుసలో ఉండడం అభినందనీయమన్నారు. పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధులను రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తానని ప్రకటించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనాన్ని అందించాలని నిర్వాహకులకు సూచించారు. అంగన్వాడీ, పల్లె దవాఖాన, ఉన్నత పాఠశాలలో అసౌకర్యాలను తెలుసుకున్నారు. ఉప సర్పంచ్ స్వామి,ఆత్మ కమిటీ డైరెక్టర్ సంతోష్ రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్ చారి, వార్డు సభ్యులు జయరాం, బాలకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షులు గ్యార మల్లేశం, గ్రామ బీఆర్ఎస్ నాయకులు తోట సత్తయ్య, కనకయ్య ర్యాకం, బాలకృష్ణ,బాబు, కరుణాకర్, నవీన్,నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు, జ్యోతి, సుదిష్ణ, స్వాతి తదితరులున్నారు.

సఫాయి కార్మికులపై బెదిరింపులు మానుకోండి

నవతెలంగాణ - నార్సింగి





గత 26 రోజులుగా సఫాయి కార్మికులు తమ డిమాండ్లను తీర్చాలని సమ్మె కొనసాగిస్తున్నారు. నార్సింగి మండలంలోని సఫాయి కార్మికులు ఇప్పటివరకు నిరసనలో భాగంగా అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. మండల కేంద్రంలో భిక్షాటన చేయడం చేశారు. మంగళవారం నార్సింగి మండలం లోని అన్ని పంచాయతీల కార్మికులు రోడ్డుపై వంటా వార్పు చేశారు. రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన తెలిపారు. సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షురాలు గౌళీకర్ బాలామణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సఫాయి కార్మికులు మురికి అని చూడకుండా, ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పనులు చేస్తారని, కరోనా కాలంలో సైతం ప్రాణాలను తెగించి సఫాయి పనులను చేశారని తెలిపారు. అలాంటి కార్మికుల న్యాయబద్దమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోకపోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరడం లేదని, వారికి బంగళాలు, భవంతులు కట్టివ్వమనడం లేదని, తమకు న్యాయ బద్దంగా పెంచాల్సిన జీతాలను, ఉద్యోగ భద్రత మొదలైనవి కోరుతున్నారని అన్నారు. ఎస్సీ లకు 3 ఎకరాల భూమిని ఇస్తామని, 10 లక్షలు ఆర్థిక సహాయం అందజేస్తామని అన్నారని, వీరు ఎస్సీ లు కాదా అని ప్రశ్నించారు. కొద్ది మంది సర్పంచులు, కార్యదర్శులు కార్మికులను విధులలో చేరాలని, లేకపోతే కొత్త వారిని నియమించుకుంటామని బెదిరిస్తున్నారని, వారి వివరాలు తమ వద్ద ఉన్నాయని, వారు బెదిరింపులు మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో లో అన్ని మండలాల పంచాయతీల కార్మికులతో ఆయా గ్రామాలలో భిక్షాటన చేస్తామని, పంచాయతీ కర్యలాయాల ఎదుట వంటా వార్పు చేస్తామని, సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ జననం కార్మికుల హక్కుల పోరాటం కోసమే అయ్యిందని, మాకు పోరాటాలు కొత్త కావని అన్నారు. సర్పంచులు, కార్యదర్శులు బెదిరింపులు మానుకోవాలని, ప్రభుత్వం చర్చలకు పిలిసి తమ డిమాండ్లను తీర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో బాలమని తో పాటు సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ, మండలం లోని అన్ని పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో ఉచిత వైద్య శిబిరం

నవ తెలంగాణ రాయపోల్



ఉచిత వైద్య శిబిరం నిర్వహించి పేద ప్రజలకు ఉపయోగకరంగా చికిత్సలు అందించడం పలు రకాల ఆరోగ్య సమస్యల ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఉచితంగా మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని బిఆర్ఎస్ పార్టీ మండల సీనియర్ నాయకులు మన్నే ఆంజనేయులు అన్నారు. రాయపోల్ మండలం కొత్తపల్లి లో మేడ్చల్ మెడిసిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలం దృశ్య సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు చుట్టుపక్కర పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వైద్యులు బిపి, షుగర్, జ్వరం,మోకాళ్ళ నొప్పులు, దగ్గు లాంటి తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.ఈ వైద్య శిబిరం లో 120 మంది ని పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అలాగే 55 మంది నీ మెరుగైన వైద్యం కోసం మెడిసిటీ హాస్పిటల్ కి రిఫర్ చేశారు. వారి కి అవసరం నిమిత్తం ఉచితంగా సిటీ స్కానింగ్ తో పాటు ఎమ్మారై స్కానింగ్ తీయడం జరుగుతుందన్నారు. ఉప సర్పంచ్ మల్లేష్, డాక్టర్ రఘురాం, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ అప్రిన్, డాక్టర్ ఇమ్రాన్, సుధాకర్, నాగార్జున, మంజుల తో పాటు కొమురవెల్లి, స్వామి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ కొండపాక



కుకునూరుపల్లి మండలం లకుడారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పత్రి రాజయ్య భార్య రామవ్వ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆయన కుటుంబాన్ని ఎఫ్ డి సి చైర్మన్ ప్రతాపరెడ్డి, డిసిసిబి చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. వారు పాడే మోసి శవయాత్రలో పాల్గొన్నారు.



నేరలకుంట చెరువును పరిశీలించిన రెవెన్యూ అధికారులు



నవతెలంగాణ జోగిపేట

అందోలు మండలం రాంసానిపల్లి గ్రామ శివారులోని 227 సర్వేనంబర్‌లో నేరలకుంటను రెవెన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ మధుకర్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి నేరలకుంట చెరువును పరిశీలించారు. నేరలకుంటకు సంబంధించి 227 సర్వేనంబర్‌లో 12.04 ఎకరాల ఎఫ్‌టీఎల్ భూమి విస్తీర్ణం ఉండగా, దీనికి అనుకుని ఉన్న పట్టా భూమిని హైదరాబాద్‌కు చెందిన వారు కొనుగోలు చేశారు. ఈ భూములను పరిశీలించిన అధికారులు ఎఫ్‌టీఎల్ పరిధిలోని సుమారుగా రెండు, మూడు ఎకరాలను కలుపుకుని వారు కొనుగోలు చేసిన పట్టాభూమితో కలుపుకుని చుట్టూ పెన్సింగ్ వేసినట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ భూములో నీటి నిలువ జరగకుండా అడ్డుకునే ప్రయత్నం చేస్తే చట్టారిత్యా నేరమన్నారు. నేరలకుంట భూమి విషయం గూర్చి ఇరిగేషన్ శాఖ అధికారులకు నివేదికను పంపిస్తామని ఆయన తెలిపారు.

10వ వార్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 10 వ వార్డులో ఎస్డీఎఫ్ నిధుల కింద రూ .30 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు అవార్డు కౌన్సిలర్ పట్ల రేఖ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం రోడ్డు పనులకు ఆమె కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో నెలకొన్న సమస్యలన్నింటిని వెంట వెంటనే పరిష్కరిస్తున్నామని ఆమె తెలిపారు. అవసరమున్న చోట సీసీ రోడ్లు, మురికి కాల్వల్ల నిర్మాణాలు కోట్ల రూపాయలతో చేపట్టడం జరిగిందన్నారు. వార్డు అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. సీసీ పనులు చేపట్టడం పట్ల వార్డులోని కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి









నవతెలంగాణ-కంది

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు అన్నారు. గ్రామా పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెలో సోమవారం జి సాయిలు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం 27 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పరిష్కరించడం లేదన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. బిల్ కలెక్టర్ కారోబార్లను సహాయ కార్యదర్శిలుగా గుర్తించాలన్నారు. ఈఎస్ఐపీఎఫ్ అమలు చేయాలన్నారు. సమస్యలతో సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పరిష్కరించకుండా బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లేశం, శివ, కుమార్, అశోక్, లక్ష్మి ,నాగరాజు, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-జోగిపేట

గ్రామాలలో పని చేస్తున్న పంచాయతీ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం జోగిపేట ఎంపీడీవో కార్యాలయం ముందు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో గత 20 సంవత్సరాలు నుండి అనేక రకాల పనులు చేస్తూ చాలి చాలని జీతంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే జీవన్ నెంబర్ 60 ప్రకారము రూ.19500 చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలనీ అన్నారు. జీవో నెంబర్ 51 ని తక్షణమే సవరించి మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలనీ, బిల్ కలెక్టర్ కారోబార్గ గా పనిచేస్తున్న వారిని సహాయ కార్యదర్శిలుగా నియమించాలనీ, పని భద్రత, కనీస వేతనం, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని తక్షణమే ప్రభుత్వం చర్చలు జరిపి సంస్థలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరేశం, సత్తయ్య, సామెల్, కుమార్, ఆంజనేయులు, సత్తయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-పుల్కల్

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గత 25 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు గ్రామ పంచాయతీ కార్మికులు. చాలీచాలని వేతనాలతో రాత్రి పగలు అనే తేడా లేకుండా పనిచేస్తున్న తమకు కనీస వేతనం రూ.19 వేలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఓ న్నాపురం మన్నె శివశంకర్ కార్మికులు రాములు విజయ్ కుమార్ సుందరయ్య ఎల్లయ్య సాజిద్ శోభ శాంతమ్మ లక్ష్మి పద్మారావు సంజీవులు పోచయ్య దుర్గయ్య ఆయా గ్రామాల గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఝరాసంగం

బంగారు తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికుల కన్నీళ్లు కనిపించడం లేదా? అని బహుజన్ సమాజ్ పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ సిద్దు రావణ్ ప్రశ్నించారు. మంగళవారం పంచాయతీ కార్మికులతో ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఆటో స్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సూపరిండెంట్ మారుతి విట్టోబాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీ కార్మికులకు జీవో 60 ప్రకారం జీతాలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలన్నారు. ఉద్యోగులకు చెల్లించేటటువంటి డిఏ,టిఏ,ఈఎస్ఐ,పిఎఫ్ ,స్పెషల్ అలవెన్సును చెల్లించాలని జీవిత బీమా 10 లక్షలు, ఆరోగ్య బీమా 10 లక్షలు గ్రాట్యుటీ 20 లక్షలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండల అధ్యక్షులు ఇస్సం, రాహుల్ అసెంబ్లీ కార్యదర్శి, బాబురావు సీనియర్ నాయకులు, రాజు, ప్రదీప్,యాదగిరి,మోజెస్ ,బన్నీ ,అరుణ్ గోపాల్ , సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డుతో ఇక్కట్లు



నవతెలంగాణ-కొండాపూర్

మండల కేంద్రం మీదుగా వెళుతున్న ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు సరిగ్గా లేకపోవడంతో తరచూ ప్రమాదంలో జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొన్నది. గతంలో కురిసిన వర్షాలకు వరద నీరు వలన పోలీస్ స్టేషన్ దగ్గర నుంచి మ్యూజియం గడ్డపై వరకు సుమారు 100 మీటర్ల మీద రోడ్డు అంచుల భాగంలో గుంతలు ఏర్పడ్డాయి. ఒకే సమయంలో రెండు వాహనాలు వస్తే వెళ్లడం కష్టంగా మారుతుందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు ఇరువైపుల గోడ ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనం కనిపించే అవకాశం లేకపోయింది అటువంటి ప్రదేశాలలో కనీసం సూచిక బోర్డు లేకపోవడం ఆర్అండ్ బి అధికారుల పనితీరుకు నిదర్శనం అంటూ పలువురు ఎద్దేవా చేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఘనంగా ఫలహారం బండి ఊరేగింపు



నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ అధిక శ్రావణమాసం సందర్భంగా బి.సి కాలనీలో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాన్ని కాలనీ యువకులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ యువత నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి హాజరై ఊరేగింపు యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం రేణుక ఎల్లమ్మ నల్ల పోచమ్మ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవతల చల్లని చూపులతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో సీ.ఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలోనూ దేశంలోనూ బి.ఆర్.ఎస్ ప్రభంజనం సృష్టించాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా యువత నాయకుడు వి.ప్రవీణ్ రెడ్డి'ని స్థానిక యువకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సత్యనారాయణ , వెంకట్ , రమేష్ , శ్రీనివాస్, రాజశేఖర్, సాయి, మహిళలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నూతన ఎస్ఐని కలిసిన నాయకులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

హద్నూర్ పోలీస్‌స్టేషన్‌కు నూతన ఎస్సైగా వచ్చిన రామానా యుడును మంగళవారం సర్పంచ్‌లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానించారు. మండలంలో సర్పంచులు, నాయకులు శాంతిభద్రతలకు సహకరించాలన్నారు. సర్పంచ్‌లు మహిపాల్, చంద్రప్ప, పీటర్ రాజు , సరితదేవదాస్ ఉన్నారు.

లక్ష ఆర్థిక సహాయానికి దరఖాస్తు చేసుకోండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



నవతెలంగాణ - పటాన్ చెరు

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం లక్ష రూపాయల ఆర్థిక సహాయం పథకాన్ని ప్రవేశపెట్టిందని, పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అర్హులైన క్రిస్టియన్ మైనార్టీలు ఈ పథకం ద్వారా లబ్ది పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కోరారు. సీఎం కేసీఆర్ ఇప్పటికే దళితబంధు, బీసీ బంధు పథకాలు ప్రవేశపెట్టి వారి జీవితాల్లో నూతన వెలుగులు తీసుకొని వచ్చారని తెలిపారు. ఈ నెల 14వ తేదీలోగా www.tsobmmsgov.in వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ ద్వారా అప్లై చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఈ పథకం ద్వారా లబ్ది పొందవచ్చని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా మైనారిటీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సూచించారు.

మాజీ ఎంపీటీసీ సుభాష్‌కు పరామర్శ



నవతెలంగాణ-జహీరాబాద్

కార్యకర్తలే పార్టీకి అండ అని, వారికి అన్ని సమయాల్లో అండగా ఉండాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారని, ఆయన బాటలోనే పయని స్తున్నామని బీఆర్ఎస్ నాయకులు నరోత్తం అన్నారు. సోమవారం మొగుడంపల్లి మండలం మాన్నాపూర్ గ్రామ మాజీ ఎంపీటీసీ సుభాష్ తల్లి గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. బీఆర్ఎస్ నాయకులు వై.నరోత్తం వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ యూసుఫ్, ఎస్.గోపాల్, దశరథ్, చెంగల్ జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలవరపెడుతున్న కండ్లకలక

- రోజురోజుకు పెరుగుతున్న కేసులు



నవతెలంగాణ - ఝరాసంగం

కండ్లకలక బ్యాక్టీరియా రోజురోజుకు చాప కింద నీరులా పెరుగుతోంది. దీంతో మండల వైద్యాధికారులు అప్రమత్తమై గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని బర్దిపూర్, ఏడాకులపల్లి, దేవరంపల్లి, మచ్నూ ర్, వనంపల్లి తండా, మేదపల్లి, గుంత మర్పల్లి, పొట్టి పల్లి గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా 55 కేసులు నమోదు అయ్యాయని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రమ్య పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నవతెలంగాణ-అమీన్ పూర్

అమీన్‌పూర్ మున్సిపాలి టీని అన్ని రంగాలలో ఆదర్శంగాతీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నా మని అమీన్ పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి తో కలసి మల్లారెడ్డి కాలనీ, దివ్యశ్రీ ఎన్క్లేవ్ లలో 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి కాలనీలో సిసి రోడ్లు, యూజీడీలు నిర్మాణాలకు ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జ్యోతి రెడ్డి,వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, స్థానిక కౌన్సిలర్ లావణ్య శశిధర్ రెడ్డి, కృష్ణ,నవనీత జగదీష్ , బీజిలి రాజు,కవిత శ్రీనివాస్ రెడ్డి,కో ఆప్షన్ మెంబర్ యూనుస్, సీనియర్ నాయకులు దాస్ యాదవ్, లింగం గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మత్స్య భవనానికి రూ.50 వేల సాయం

నవతెలంగాణ-జిన్నారం: జిన్నారం మండల పరిధిలోని ఊట్ల గ్రామంలో నిర్మిస్తున్నా మత్స్య శాఖ భావనాని కి ఖాజిపల్లి చిరుమని శ్రీనివాస్ ముదిరాజ్ యాభై వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ ఊ ట్ల సుంకర బోయిన మహేష్ ముదిరాజ్ బృందానికి ఈ సాయం అందజేశారు.ఈ కార్యక్రమం లో ముదిరాజ్ సంఘం మండల నాయకులు, వావిలాల సింగిల్ విండో డైరెక్టర్ నక్షత్ర పర్వతాలు,వావిలాల మత్స్య శాఖ అధ్యక్షుడు రమేష్, ఉట్ల మత్స్య శాఖ నాయకులు బొగురుసత్యనారాయణ,పూజారి రాజు,విరాబోయిన సాయికుమార్, బోగురు బాలేష్, కర్రె నాగరాజు, పూజారి శ్రీనివాస్,నాగారం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నారాయణఖేడ్

క్యాబినెట్ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఉద్యోగులకు శుభవార్త ప్రకటించిన సందర్భంగా మంగళవారం ఖేడ్ పట్టణంలోని ఆర్టీసి డిపో లో ఆర్టీసి ఉద్యోగులు, సిబ్బంది రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంతో కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారనున్నరాని తెలిపారు. 43 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు ఆగస్టు 3న ప్రారంభం కానున్న శాసనసభ సమావేశాల్లో ఈ బిల్లుకి ఆమోదం తెలుపుతారన్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై టీఎస్ఆర్టీసీ ఉద్యోగుల హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు. కార్మికులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఆర్టీసీ ఉద్యోగులు ఎమ్మెల్యేకి పగిడి కట్టి సన్మానించారు. కార్యక్రమంలో యం బి ఆర్ ఫౌండేషన్ చైర్మెన్ మహారెడ్డి రోషన్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయ్ బుజ్జి,మండల జెడ్పీటీసీ రాథోడ్ లక్ష్మీబాయి రవీందర్ నాయక్,సిర్గాపూర్ మండల వైస్ ఎంపీపీ మాధవ రావు పాటిల్, మున్సిపల్ చైర్మెన్ రూబీనా నజీబ్,ఎంపీపీ తనయులు కర్ర రమేష్ చౌహాన్, మున్సిపల్ కౌన్సిలర్లు పుటాలా కవిత విఠల్,నర్సింలు,స్వప్న అభిషేక్ షేట్కార్,సంధ్యారాణి రామకృష్ణ,మాజిద్,కో ఆప్షన్ సభ్యులు లాయిక్, ఎంపీటీసీ విఠల్,ఖేడ్ మండల పార్టీ ఉపాధ్యక్షులు జుర్రు నర్సింలు యాదవ్,సర్పంచ్ రాజు నాయక్, మున్సిపల్ మైనారిటీ అధ్యక్షులు గౌస్ చిస్తీ,నాయకులు లక్ష్మి నారాయణ,కొమ్ము శేఖర్,కట్టకింది సంజీవ్ రెడ్డి,సత్యం సేట్,నర్సింలు,మున్సిపల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్,మాజీ ఎంపీటీసీ ముజామిల్,యువ్త నాయకులు ఉబెద్,సాయి యాదవ్, డిపో మేనేజర్ మల్లేశయ్య, మార్కెటింగ్ మేనేజర్ పాండు,ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

దళితబంధు బహిష్కరిస్తాం



నవతెలంగాణ-జిన్నారం

అర్హులైన వారందరకీ దళితబంధు పథకం అందకుంటే మూకుమ్మడిగా భహిష్క రిస్తామని జిన్నారం మండలం లక్ష్మీపతి గూడెం గ్రామ దళితులు అధికారులను హెచ్చరించారు. మంగళవారం జిన్నారం మండల పరిషత్తు అధికారి రాములుకు దళిత కుటుంబాలు ఉప సర్పంచ్ మామిడిపల్లి అశోక్, పట్నం శ్రీనివాస్ నేతృత్వంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సంధర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ దళిత బంధు అర్హులైన వారికి అందడం లేదంటూ మండిపడ్డారు. మా గ్రామంలో 50 దళిత కుటుంబాలు ఉన్నాయని ప్రతి ఒక్క కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో మా గ్రామంలో ఎవరికీ దళిత బంధు అవసరం లేదని ఆగ్రహం వెలిబుచ్చారు . గ్రామంలో దళిత కుటుంబాలను ఎంక్వయిరీ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బందు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు ఎంపీడీవోకు విజ్ఞప్తి చేశారు. లక్ష్మీపతి గూడెం గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం నల్లగండ్ల శంకర్ అనే దళితుని స్థలాన్ని తీసుకొన్నప్పటికీ ఇప్పటివరకు ఆ కుటుంబానికి తగిన సాయం అందలేదన్నారు. అధికారులు ప్రభుత్వం తక్షణమే స్పందించి ఇంటి స్థలాన్ని కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో లక్ష్మీపతి గూడెం గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ మామిడిపల్లి అశోక్, పట్నం శ్రీనివాస్ నల్లగండ్ల శంకర్, అశోక్, సతీష్, నరేందర్, నవీన్, నరేష్, విజయ్, శివకుమార్, రాములు, ప్రవీణ్ పాల్గొన్నారు.

ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

దళిత బంధు పథకాన్ని ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలినీ కోరుతూ దళిత బంధు సాధన సమితి జిల్లా కన్వీనర్ పోలీస్ రామచందర్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ మాధురికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించి 70 సంవత్సరాలు పూర్తి అయిన దళితుల బతుకులు పెదరికంలోనే ఉన్నాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాల వల్ల ఏ ఒక్క దళితుని తలరాత మారలేదు అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన దళిత బందు పథకం కొంతమందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం కాకుండా ప్రతి దళిత కుటుంబానికి వర్తించే విదంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో దళిత బందు సాధన సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జె. ఏసురత్నం, జీ. కిషన్, ప్రేమనందం,టి. పూర్ణచంద్రరావు, బి. లింగం,కె. భాస్కర్, జీ. సురేశ్, అందెల మొగులయ్య, బి. శివకుమార్, కిషోర్, కుమార్, పాల్గొన్నారు

గ్రామాల్లో బెల్ట్ షాపులతో ఇబ్బందులు



నవతెలంగాణ- సదాశివపేట

గ్రామాల్లో బెల్ట్ షాపులతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలంగాణ ప్రజాశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దొడ్ల వెంకట్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపు లను ఏర్పాటు చేసి యువతను పూర్తిగా చెడగొట్టి, తప్పుదారి పట్టిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ప్రతి రోజూ మద్యం సేవించి దాదాపు రెండు వందల మంది యువకులు తమ ప్రాణాలను బలి ఇస్తున్నారని చెప్పారు. వారి కుటుంబాలు రోడ్డున పడ్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. వారి కుటుంబాల ఉసురు కచ్చితంగా ప్రభుత్వానికి తగులుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రాష్ట్రంలో బెల్ట్ షాపులు పూర్తిగా తొలగించి పచ్చటి గ్రామాలను,తెలంగాణ సమాజాన్ని కాపాడాలని కోరారు. అతి త్వరలో ప్రజాశక్తి పార్టీ ఆధ్వర్యంలో బెల్ట్ షాప్ లను నిర్వీర్యం చెయ్యాలని అసెంబ్లీ వరకు పాదయాత్ర చేపడ్తమని ఆయన అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-అమీన్ పూర్

నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తుందని అమీన్ పూర్ ఎంపీపీ ఈర్ల దేవానందం, జడ్పిటిసి సుధాకర్ రెడ్డిలు అన్నారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో అమీన్పూర్ మండలాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుపుతున్నామని తెలిపారు. అమీన్పూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా వివిధ గ్రామాలకు చెందిన ఐదుగురు లబ్దిదారులకు మంజూరైన లక్ష ముప్పై మూడువేల రూపాయల విలువైన చెక్కులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ వైద్య రంగంలో విప్లవత్మక సంస్కరణలు చేపట్టారని తెలిపారు. నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు కృష్ణ, భాస్కర్ గౌడ్, రవి, సీనియర్ నాయకులు రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయానికి క్రిస్టియన్ అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

నవతెలంగాణ-సంగారెడ్డి: ఆర్థిక మద్దతు పథకం కింద ఆర్థిక సహాయం కొరకు జిల్లాలోని క్రిస్టియన్ అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ మంగళవారం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక మద్దతు పథకం కింద క్రిస్టియన్‌లకు వంద శాతం సబ్సిడీతో ఒక లక్ష రూపాయలతో ఏదేని యూనిట్ ఏర్పాటు చేసుకోవడానికి క్రిస్టియన్ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇట్టి ఆర్థిక సహాయానికి అభ్యర్థుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాల వారికి రెండు లక్షల లోపు ఉండాలని, 21 నుండి 55 సంవత్సరాల లోపు వయస్కులు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా OBMMS Portal www.tsobmmsgov.in లో ఈనెల 14 లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మరిన్ని వివరాలకు సంగారెడ్డి కలెక్టరేట్ లో గల జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయంలో నేరుగా గానీ,లేదా 8106108998 /9542867203 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు చెందిన అర్హులైన క్రైస్తవ సోదర సోదరీమణులు ఇట్టి ఆర్థిక సహాయానికి నిర్ణీత సమయంలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

తెలంగాణ రైతాంగ పోరాట వీరుడు కృష్ణమూర్తి



నవతెలంగాణ-కంది

తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం కంది మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాసం కృష్ణమూర్తి 17వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నర్సిములు మాట్లాడుతూ కాసం.కృష్ణమూర్తి 1921లో జనగామ జిల్లా నిర్మాల గ్రామంలో జన్మించి తన 16 వ ఏటనే ఉద్యమంలోకి అడుగుపెట్టి పేద ,కూలీల పక్షాన అనేక పోరాటాలు నిర్వహించారని అన్నారు. నైజాం రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి పేదలకు భూములు పంచినటువంటి చరిత్ర కృష్ణమూర్తి గారి కుందని అన్నారు. దొరల నియంతృత్వం పోవాలని, పేదల రాజ్యం రావాలని తన జీవిత కాలమంతా ప్రజల పక్షాన పోరాడాడని అన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ పేదలు గూడు కోసం జాగ అడిగితే ఇవ్వకుండా, పెద్దలు ఎకరాలకొద్ది కబ్జా చేస్తున్న చూస్తూ ఉరుకుంటున్నారు.పేదలకు ఇళ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సుజాత, నర్సింహులు, సువర్ణ, నసీమా, మల్లయ్య, పోచమ్మ, సాబెర్ పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలపై ప్రభుత్వానికి శ్రద్ధ ఏదీ?



నవతెలంగాణ-పటాన్ చెరు: బీఆర్ఎస్ ప్రభుత్వానికి రాజకీయాలపై ఉన్న ఫోకస్ వరద సహాయక చర్యలపై లేదని టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ విమర్శించారు. తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పది రోజులుగా కురిసిన భారీ వర్షాలు, వరదలతో తెలంగాణ అంత అతలాకుతలం అయిందన్నారు. దాదాపు 60 మంది భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి విలయ తాండవం చేయడంతో మృత్యువాత పడ్డారని అన్నారు. పంటలు పెద్దఎత్తున నష్టపోయి, ఇళ్లు కూలిపోయి, పశువులు, మేకలు, కోళ్లు, గొర్రెలు వేల సంఖ్యలో మరణించారని, రోడ్లు, వంతెనలు చాలా దెబ్బతిన్నాయని. ఇలాంటి విపత్కర పరిస్థితులు రాష్ట్రంలో ఉంటే నిన్న కేబినెట్ సమావేశంలో ముఖ్యమంత్రి, మంత్రులు కనీసం కూడా స్పందించలేదని ఆరోపించారు. కనీసం మృతి చెందిన వారికి సంతాపం ప్రకటించలేదన్నారు. వరద బాధితులకు ఎలాంటి పరిహారాలు ప్రకటించలేదని. కనీసం వరద ప్రాంతాలను సందర్శించకుండా మహారాష్ట్ర కు వెళ్లారని విమర్శించారు. తన రాజకీయాలే ప్రధానంగా కేసీఆర్ ప్రవర్తిస్తున్న తీరు అమానవీయంగా, జుగుప్సాకరంగా వున్నాయని మండి పడ్డారు.ఇప్పటి కైనా ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతుకు పంటల నమోదు తప్పనిసరి



నవతెలంగాణ-న్యాల్‌కల్ : రైతులు తాము సాగు చేసిన పంటల వివరాలను విధిగా ఏఈవోల వద్ద నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి లావణ్య పేర్కొన్నారు. మంగళవారం న్యాల్‌కల్‌లో రైతుల పొలాలకు వెళ్లి పంటలను ఆమె పరి శీలించారు ఇప్పటివరకు మండలంలో ఏఈఓ లు 12238 ఎకరాలు పంట నమోదు చేసినట్లు చెప్పారు. ఏఈఓ ఈనా, గ్రామ నాయకులు మఠం శివస్వామి ఉన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామంలో ఎలాంటి పారిశుద్యం ఇబ్బందులు లేకుండా అన్ని రంగాల్లో గ్రామాన్ని పరిశుభ్రంగా ఏర్పాటు చేసి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్టు గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్‌లు పేర్కొన్నారు. మండలంలోని జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజీగూడలో ఎంపీటీసీ నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం పాటుపడుతున్నట్టు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ గ్రామాన్ని దత్తత తీసుకోవడంతో జెడ్పీ నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని అలాగే ఎంపీటీసీ నిధులతో డ్రైనేజి పనులను చేపడుతున్నట్టు తెలిపారు. గ్రామాన్ని పారిశుద్యంలో ముందుంచి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాగౌడ్, పీఆర్ ఏఈ మధు, కార్యదర్శి నందిని, నాయకులు, గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రూర్బన్ యూనిట్లను సందర్శించిన పీడీ



నవతెలంగాణ-పాపన్నపేట

రూర్బన్ నిధుల కింద మంజూరైన యూనిట్లను మంగళవారం డీఆర్డిఏ పీడీ శ్రీనివాస్, పాపన్నపేట్ మండల పరిధిలోని రూర్బన్ రెండో విడత యూనిట్లను సందర్శించి పరిశీలించారు. కొత్తపల్లి గ్రామంలోని మంచినూనె తయారీ యూనిట్, అరేపల్లి టీ గ్లాసుల తయారీ యూనిట్, మినుపూరు గ్రామంలోని బేకరీ యూనిట్, కొత్త లింగాయి పల్లి గ్రామంలో విస్తరాకుల తయారీ యూనిట్, చీకోడ్ గ్రామంలో పసుపు కారంపొడి అల్లం వెల్లుల్లి తయారీ యూనిట్, మండల కేంద్రంలో ఐకెపి మండల మహిళా సమాఖ్య ద్వారా ఏర్పాటు చేయబోయే వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రాన్ని కూడా సందర్శించారు యూనిట్‌ల వల్ల స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ జగన్, అరేపల్లి సర్పంచ్ శ్రీనాథ్, ఐకేపీ డీపీఎం - మోహన్, ఏపీఎం-జి. సాయిలు, సీసీలు యాదయ్య, రాజు, శివరంజని వీఓఏలు స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నాసిరకంతో సీసీ రోడ్డు పనులు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రోడ్లు బాగుండాలనే ఉద్దేశంతో సీసీ రోడ్లకు వందల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నది. మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి నిజాంపేట మండల కేంద్రానికి దాదాపుగా రూ.1.30 కోట్లను మంజూరు చేయడం జరిగింది. సీసీ రోడ్లను నాణ్యత ప్రమాణాలతో వేయాలని అధికారులు ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి కాంట్రాక్టర్లకు చెప్పినప్పటికీ, కాంట్రాక్టర్లు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రైమరీ స్కూల్ నుంచి హైవే రోడ్డు వరకు దాదాపుగా రూ.20 లక్షలతో సీసీ రోడ్డు వేస్తున్నారు. పూర్తిగా డస్ట్, కంకర తక్కువ మోతాదులో సిమెంటు ఇసుక కలపకుండానే వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక, కంకర, సిమెంటు, సమపాళ్లలో కలిపి నాణ్యత ప్రమాణాలతో వేయాలని ఉన్నప్పటికీ అదేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు పంచాయతీరాజ్ ఇంజనీర్ స్పందించి నాణ్యత ప్రమాణాలతో కూడిన సీసీ రోడ్డు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు

హరితహారం మొక్కలు పంపిణీ చేసిన సర్పంచ్



నవతెలంగాణ-చేగుంట

హరితహారంలో భాగంగా మండలంలోని చందాయిపేట గ్రామంలో మంగళవారం ఇంటింటికి ఆరు మొక్కల చొప్పున స్థానిక సర్పంచ్ స్వర్ణలత భాగ్యరాజులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చెట్లు పెంచడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. భావితరాలకు మంచి భవిష్యత్తును ఇచ్చిన వాళ్ళమవుతామని, అలాగే వాతావరణ కాలుష్యాన్ని పారదొలవచ్చుని, ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ సీజనల్ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండి, కాచి వడపోసిన నీటిని తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలు ఇంట్లోనే తయారుచేసుకుని తినాలని, ఆరు బయట తినుబండరాలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రదీప్, పారిశుద్ధ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి



నవతెలంగాణ-వెల్దుర్తి

కరెంటు షాక్‌తో ఓ వ్యక్తి మృతి చెందడంతో మాసాయిపేట్ మండలం నాసానిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం నీళ్లను వేడి చేయడానికి ఇంట్లో ఎలక్ట్రికల్ వాటర్ హీటర్ పెట్టిన చింతల సురేష్ ఆకస్మాత్తుగా ముట్టుకోడంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే అతన్ని హుటా హుటిన ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా, ఆలోపే మరణించినట్లు కుటుంబీకులు తెలిపారు. కళ్ళముందు తిరిగిన వ్యక్తి అప్పటికప్పుడే చనిపోవడంతో ఇంట్లో, గ్రామంలో విషాద ఛాయలు చోటుచేసుకున్నాయి.

కట్ట కాలువ నిర్మాణం చేసి రైతులను ఆదుకోవాలి



నవతెలంగాణ-నార్సింగి

దేవుని చెరువు కట్ట కాలువ పనులు త్వరగా ప్రారంభించి రైతులను ఆదుకోవాలని నార్సింగి మండలం భీంరావ్ పల్లి వార్డు సభ్యుడు బొయిని భూషణం కోరారు. మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో భూషణం మాట్లాడుతూ మండలంలోని సామలకుంట అలుగు పారె నీరు భీంరావ్ పల్లి శివారులో గల దేవుని చెరువుకు మళ్ళించడం ద్వారా అదనంగా 50 ఎకరాల రైతులకు లాభ దాయకంగా, బ్రతుకమ్మలకు, పశువులకు పచ్చిక బయలు ఉంటుందన్నారు. కట్ట కాలువ నిర్మాణం చేయకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుందని ఆయన వాపోయారు. తాను గతంలో ఈ విషయమై పలుమార్లు జిల్లా మంత్రి హరీశ్‌రావుకు విజ్ఞప్తి చేశానని తెలిపారు. ఈ మేరకు అధికారులు పలుమార్లు సర్వే నిర్వహించినా పనులు ప్రారంభం కాలేదన్నారు. భూషణం మాట్లాడుతూ 2019 నుంచి ఇరిగేషన్ అధికారుల దృష్టికి ఎన్నోసార్లు కట్ట కాలువ విషయం తీసుకు వెళ్లానన్నారు. సంబంధిత అధికారులు, నాయకులు ఇకనైనా స్పందించి వెంటనే కట్ట కాలువ నిర్మాణం పనులు మొదలు పెట్టి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వరి పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారి



నవ తెలంగాణ-నిజాంపేట

నిజాంపేట్ మండలంలోని బచ్చురాజ్‌పల్లి గ్రామంలో పలు రైతుల వరి పంటలను మండల వ్యవసాయ అధికారి సతీష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటలో అక్కడక్కడ మోగి పురుగు ఉధృతి గమనించడం జరిగిందన్నారు. దీని నివారణకు నారుమళ్లల్లో అయితే ఎకరా నారుమడికి 800 గ్రా 3జీ గుళికలు చల్లుకోవాలన్నారు. వరి నాటేప్పుడు వరి కొనలు త్రుంచి నాటుకోవాలని, వరి నాటిన తర్వాత పురుగు ఉధృతి గమనిస్తే ఎకరానికి 8 కే జి 3జి గుళికలు లేదా 6కె జి 4 జి గుళికలు నీరు పలుచగా పెట్టి చల్లుకోవాలి. అలాగే సిఫారసు చేసిన యూరియాను 3,4 దఫాలుగా చల్లుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కావేరి , రైతులు రాజలింగం, మల్లేశం, పర్శరాములు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు ప్రోత్సాహం



నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగిఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసి వారిని క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ లక్ష్యమని సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షులు పంచమి రేణుకుమార్‌లు తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలత శేఖర్‌గౌడ్ దత్తత గ్రామం గౌతోజిగూడలో రాష్ట్ర ప్రభుత్వం ద్వార వచ్చిన క్రీడా సామాగ్రిని మంగళవారం యువతకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామీణ ప్రాంతాల్లోని యువతను క్రీడా కారులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. క్రీడా ప్రాంగణాలలో యువతకు నైపుణ్యాన్ని పెంచుకునే విధంగా పరికరాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అలాగే వారికి క్రికెట్, వాలీబాల్, దేహదారుఢ్యాన్ని పెంచుకునేందుకు డంబుల్స్ లాంటి వస్తువులను అందజేస్తున్నట్టు తెలిపారు. గ్రామీణ ప్రాతాల్లోని యువత సద్వినియోగం చేసుకుని క్రీడాకారులుగా ఎదగాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నారాగౌడ్, కార్యదర్శి నందినితో పాటు గ్రామ పార్టీ నాయకులు యువకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల వంటావార్పు







నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల సాధన కోసం కార్మికులు చేపట్టిన నిరవదిక సమ్మె మంగళవారంతో 27వ రోజుకు చేరుకుంది. మంగళవారం గ్రామపంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ ఆధ్వర్యంలో మనోహరాబాద్ మండల కేంద్రంలోని నిరసన దీక్షా శిభిరం వద్ద వంటా వార్పు చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 27 రోజులుగా కార్మికులు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ముఖ్యమంత్రికి లేకపోవడం సిగ్గుచేపటని, వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మిక జాక్‌తో చర్చలు జరిపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 17 పంచాయతీల కార్మికులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కొండపాక

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతుది .మంగళవారం కొండపాకలో కార్మికులు చెవులు మూసుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి అమ్ముల బాల నరసయ్య నాయకులు ఆరుట్ల నర్సింలు, సాయికుమార్, ఆంజనేయులు, మల్లేశం, నరహరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ -దౌల్తాబాద్

కార్మికుల సమస్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం దౌల్తాబాద్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికుల సమ్మె 27వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు చెరుకు శ్రీనివాస్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బందికి వేతనాలు పెంచాలని, పెంపు, ఉద్యోగాలను పర్మినేంట్ చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లను పంచాయతి సహాయ కార్యదర్శిలుగా నియమించాలని, గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయమైనదని వారి సమస్యలను వెంటనే పరిష్కరించి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పడాల రాములు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బండారులాలు, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు దశరథ రెడ్డి,మాజీ సర్పంచ్లు ఆది వేణుగోపాల్,భద్రయ్య, నాయకులు డాకోల్ల ఆంజనేయులు గౌడ్, పడాల మల్లేశం,కుమ్మరి శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలోని దేశాయ్, ఠాకూర్, చారుబాయ్, కంపెనీల టీకేదారుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని నూతన బస్‌స్టాప్ సమీపంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కేసీఆర్ జిందాబాద్ పద్మాదేవేందర్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, హరీష్ రావు నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు భారీ ఎత్తున చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికుల, కర్షకుల కష్టసుఖాలను తెలుసుకొని టేకేదారులకు రూ.2 వేల పెన్షన్ అందించడం గొప్ప విషయమన్నారు. టేకేదారులకు పెన్షన్ అమలు చేసినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీకి ఏకగ్రీవ మద్దతుగా నిలుస్తామన్నారు. పద్మా దేవేందర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో టేకేదారులు శ్రీశైలం, ఎల్.రాములు గౌడ్,శంకరయ్య, తిరుపతి, కైరంకొండ నారాయణ, అమర్, బిక్షపతి, లక్ష్మీనారాయణ భాస్కర్, దానంజయ, సరేందర్ రెడ్డి, సత్యనారాయణ, గ్రామ ఉపసర్పంచ్ కొమ్మట బాబు, బీఆర్ఎస్ నాయకులు సంగు స్వామి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షులు చలిమేటి నాగరాజు రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ సంపత్, అబ్దుల్ అజీజ్, రామాయంపేట మార్కెట్ కమిటీ డైరెక్టర్ వై వెంకటేశం, మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు మావురం రాజు, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి రంజిత్ గౌడ్, రెడ్డి శెట్టి రవీందర్, తిరుమల గౌడ్, లక్ష్మణ్, సిద్ధరాంరెడ్డి, ముస్తఫా, తాడెం రవి, టేకేదారులు తదితరులు పాల్గొన్నారు.



నవ తెలంగాణ-మెదక్ టౌన్

ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో మెదక్ డిపో ప్రాంగణంలో సంబరాలు చేసుకున్నారు. సంస్థను తెలంగాణ ప్రభుత్వంలో విలీనం చేసుకోవడంతో ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మిఠాయిలు పంచి టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు. రవాణా మంత్రి పువ్వాడ అజయ్, చైర్మన్ భాగ్యరెడ్డి గోవర్ధన్, స్థానిక ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎఫ్ తిరుమలేష్, సూపర్డెంట్ సుధాకర్, కార్మిక నాయకులు శాకయ్య, మొగులయ్య, బి వి నారాయణ, సుబ్బారావు, రమేష్, సంగమేశ్వర్, శేఖర్, నర్సింలు, సత్యనారాయణ, షాకీర్, ఎజాజ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రి

సీఎం కేసీఆర్ పాలనలో మెడికల్, పీజీ కాలేజీలు
ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు మామిడి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-చేగుంట

కాంగ్రెస్, టీడీపీ 60 సంవత్సరాల పాలనలో విద్య, వైద్యం భ్రష్టు పట్టిందని, కేసీఆర్ 9 సంవత్సరాల పాలనలో విద్య, వైద్యం పురోగతి సాధించిందని ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు, దుబ్బాక బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి మోహన్ రెడ్డి అన్నారు. చేగుంట మండలం కర్ణంపల్లి ఎల్లమ్మ దేవాలయం లో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత కేసీఆర్ పాలనలో జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, పీజీ కాలేజీ, నియోజకవర్గంలో 100 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేశారన్నారు. ఇవే కాక గ్రామాలలో చిన్న పల్లె దావకానలు పెట్టి ప్రజలకు వైద్యం అందిస్తున్నారని, విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు కూడా సకాలంలో అందేలా, చదువు పూర్తి చేసుకొని ప్రజలకు వైద్యం అందించేందుకు విద్యార్థులకు మంచి భవిష్యత్తును ఇస్తున్నారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో తమ పాలనలోని వంద పడకల ఆసుపత్రిని పూర్తిచేసి, సోమవారం క్యాబినెట్ మీటింగ్లో ఆసుపత్రికి పూర్తిస్థాయిలో 71 మంది డాక్టర్లు, సిబ్బందిని మంజూరు చేశారని, అందుకు ముఖ్యమంత్రి కేసీఆర్, వైద్య ఆరోగ్య మంత్రి తన్నీరు హరీష్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, మేమే చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని, ఇది సిగ్గుచేటని మండిపడ్డారు. ఎవరికి టికెట్ వచ్చినా అందరం ఒకే తాటిపై దుబ్బాక నియోజకవర్గంలో పనిచేసి గులాబీ జెండాను ఎగరవేస్తామని ఆయన తెలిపారు.



బీడీ కార్మికులతో పాటు, టేకే దారులకు జీవన భృతి కల్పించడం జరుగుతుందని, అలాగే టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ జెడ్పిటిసి లింగయా పల్లి యాదగిరి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ చారి, దౌలతాబాద్ మండల యూత్ అధ్యక్షులు చింటూ, ఆత్మ కమిటీ అధ్యక్షులు వంగ సుదర్శన్, డైరెక్టర్ నల్ల ఆంజనేయులు, సాయికుమార్, నర్సింగరావు, పాల్గొన్నారు.

రక్తదాతలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

జీఎంఆర్ ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ

నవతెలంగాణ-తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

రక్తదాతలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని ప్రమాదంలో ఉన్న వ్యక్తులను కాపాడేందుకు రక్త దానం చేయడానికి ముందుకు రావాలని జీఎంఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ వేస్ ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ సూచించారు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, జి. యం. ఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్, తూప్రాన్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. తూప్రాన్ మున్సిపల్ పరిధిలోగల తూప్రాన్ టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారుల సంస్థ ఆదేశాలమేరకు ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్, జి.యం.ఆర్ పోచంపల్లి ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తూప్రాన్ వారి సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలను ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ గారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకటరమణ మాట్లాడుతూ రక్త దానం చేసిన వీరందరినీ అందరు ఆదర్శంగా తీసుకొని ప్రమాదంలో ఉన్న వ్యక్తుల ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడానికి ముందుండాలని తెలిపారు. జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానానికి మించిన గొప్పదనం మరొకటి లేదని తెలుపుతూ రక్తదానం చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ పోచంపల్లి హైవేస్ సిబ్బంది వెంకట రమణ, పరందామన్, ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ రావు, ప్రవీణ్, సతీష్ కుమార్ పట్నాయక్, వేంకటపతి రాజు, సిబ్బంది, ఫౌండేషన్ ఇంచార్జ్ శ్రీనివాస్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.



సోయం బాబురావు వాఖ్యలు సిగ్గుచేటు

నవతెలంగాణ-రామాయంపేట

లంబాడ గిరిజనులను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అదిలాబాద్ ఎంపీ సోయం బాబురావు వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని తెలంగాణ బంజారా ఎంప్లాయిస్ సేవా సంఘ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ ఉమ్లా నాయక్, డివిజన్ అధ్యక్షులు విఠల్ నాయక్ అన్నారు. మంగళవారం రామాయంపేట డివిజన్ సర్వసభ్య సమావేశం డివిజన్ అధ్యక్షులు ఎస్ విట్టల్ నాయక్ అధ్యక్షతన జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ ఉమ్లా నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో వారు సంయుక్తంగా మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ప్రత్యేక భాష, వేషాధారణ, జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలను అనుసరించి లంబాడాలను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్టీ జాబితాలో చేర్చారన్నారు. కానీ కనీస విజ్ఞత, అవగాహన లేని బాబు రావు అసలు విషయం తెలుసుకోకుండా అహంకారపూరితంగా, తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కులాలు, మతాల మధ్య వైషమ్యాలు సృష్టించడం సరికాదన్నారు. ఇలాంటి వాటిపై బీజేపీ తగిన చర్యలు తీసుకోవాలని, పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎం లక్ష్మణ్ నాయక్, జి రాజేందర్, శ్రీనివాస్, మూడు శ్రీనివాస్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నిజాంపేట

మండల కేంద్రానికి చెందిన గెరిగంటి శ్రీకాంతు గత వారం రోజుల క్రితం అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన తెలుసుకున్న మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి ట్రస్టు ద్వారా రూ.5000ల ఆర్థిక సహాయాన్ని దాత్రికా మారుతి చేతులమీదుగా అతని కుటుంబానికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కాంటారెడ్డి మాట్లాడుతూ వారి పిల్లల చదువుల విషయం కూడా సహాయ సహకారాలు అందిస్తానన్నారు. అనంతరం పెద్దపైడి తిరుమలరెడ్డి 4 రోజుల క్రితం మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామాయంపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్యామ్ రెడ్డి, టౌన్ ప్రెసిడెంట్ చింతల యాదగిరి, ఎంపీటీసీ నాగులు, నిజాంపేట మండల అధ్యక్షుడు లింగం గౌడ్, జిల్లా కార్యదర్శి పంజా మహేందర్, ఎండి నసీరుద్దీన్, మండల ఉపాధ్యక్షుడు మారుతి, బోయిని చంద్రం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్, సామల మహేష్, వెంకటాపూర్ సిద్ధిరాములు, రాజు లంబాడి, భూమా గౌడ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

జాతీయ పశువ్యాధుల నివారణ చర్యలు



నవతెలంగాణ-వెల్దుర్తి

పశువులకు ఈ నెల 30వ తేది వరకు గాలికుంటు వ్యాధి నివారణ వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందని డాక్టర్ రేఖా తెలిపారు. మంగళవారం మండలంలోని పశువులకు ముందస్తుగా వ్యాధి ప్రబలకుండా ఈ టీకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. కలాం శెట్టిపల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందన్నారు. పాడి రైతుల యజమానులు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పజులుద్దీన్ వి ఎల్ వో వేణుగోపాల్ కాజా సిబ్బంది పాల్గొన్నారు.

అధిక శ్రావణమాసంలో మహిళల ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండల కేంద్రంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో మంగళవారం మహిళలు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి 33 రకాల చొప్పున, 33 వస్తువులు సమర్పించుకున్నారు. ఈ అధిక శ్రావణమాసం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి వస్తునందున, వారి వారి కుటుంబ సభ్యులు అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. అతిక వాయినాలు ముట్టియడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ అయిత వెంకటలక్ష్మి, వాసవి సంఘ మహిళలు మహిళా సభ్యుల మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అంగన్వాడి భవనం మరమ్మతుల కోసం నిధులు మంజూరు



నవతెలంగాణ-వెల్దుర్తి

మండల పరిధిలో చేరేలా గ్రామంలో శిథిలావస్థలో ఉన్న అంగన్వాడి భవనాన్ని ఐసీడీఎస్ సీడీపీఓ స్వరూప రాథోడ్ మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు అంగన్వాడి భవనం మేజర్ రిపేర్ ఉన్నందున తక్షణమే ఐసిడిఎస్ రామాయంపేట్ ప్రాజెక్టు నుంచి రూ.2 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వెంటనే మరమ్మతులు చేయించి, వాడుకలోనికి తీసుకొచ్చేలాగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం తదితరులు ఉన్నారు.


అభివృద్ధి పనులు చూసి బీఆర్ఎస్‌లో చేరాం



నవ తెలంగాణ-టేక్మాల్

అభివృద్ధి పనులు చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరామని నిలబోయిన వాగు తాండాకు చెందిన నాయకులు తెలిపారు. మంగళవారం అందోల్ ఎమ్మెల్యే కాక్రాంతికిరణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన విఠల్, గోపాల్‌ల ఆధ్వర్యంలో కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బన్సిలాల్, రమేష్, మల్లేశం, సంతోష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప, ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, నాయకులు రమేష్ నాయక్, సర్దార్, కిషన్, మహేందర్ తదితరులు ఉన్నారు.

పునరావాస కాలనీలలో సమస్యలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలి





నవతెలంగాణ-సిద్దిపేట్ కలెక్టరేట్

మల్లన్న సాగర్ పునరావాస కాలనీలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో మల్లన్న సాగర్ ముంపు గ్రామాలైన ఎర్రవల్లి, సింగారం, ఏటిగడ్డ కిష్టాపూర్, రాంపూర్, బ్రాహ్మణ బంజరుపల్లి, లక్ష్మాపూర్, పల్లెపహాడ్, వేములఘాట్ గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల బాధితులకు పునరావాస కాలనీలలో ఏర్పాటుచేసిన సౌకర్యాలపై చర్చించారు. పునరావాస కాలనీలలో కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ దాదాపు పూర్తిగావచ్చిందని ఎవరికైనా రిజిస్ట్రేషన్ పూర్తిగా కాకపోతే త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట, గజ్వేల్ ఆర్డీవోలు రమేష్, బన్సీలాల్, విద్యుత్ శాఖ, ఆర్ డబ్ల్యూ ఎస్ మరియు సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరు ఎస్ఐగా సుభాష్ గౌడ్



నవతెలంగాణ-చిన్నకోడూరు

చిన్నకోడూరు ఠాణా నూతన ఎస్ఐగా సుభాష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ పోలీస్ స్టేషన్ ఎస్ఐగా విధులు నిర్వర్తించిన శివానందం బదిలీ పై వెళ్ళారు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేటలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ఐ సుభాష్ గౌడ్ ఎన్నికల నియమావళి ప్రకారం చిన్నకోడూరుకు బదిలీ కాగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం మండల ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలి



నవతెలంగాణ-తొగుట

నూతనంగా పట్టాదారు పాస్ బుక్ పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ నవీన్ తెలిపారు. మంగళవారం వడ్డే కిష్టయ్య, బండారు భారతి సభ్యుల నుండి రైతు భీమా నామినేషన్ పత్రాలను సేకరించారు. ప్రభుత్వం విధించిన గడువు 5 తేదీ ముగింపు సందర్భంగా నూతనంగా పట్టాదారు పాస్ బుక్కు పొందిన రైతు లు అందరు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఆయన వెంట గ్రామ రైతు బంధు సమితి అధ్యక్షులు బండా రు స్వామి గౌడ్,రైతులు తదితరులు ఉన్నారు.

గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా కోల రాజుగౌడ్



నవతెలంగాణ-నంగునూరు

గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడుగా కోల రాజుగౌడ్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి గౌతమ్ ప్రకటించారు. మండల కేంద్రమైన నంగునూరు గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కోల రాజు గౌడ్, ఉపాధ్యక్షులుగా పురుషోత్తమ మల్లేశం గౌడ్, ప్రధాన కార్యదర్శిగా కోల యాదగిరి గౌడ్, కోశాధికారిగా కోలా సతీష్ గౌడ్, సహాయ కార్యదర్శిగా పోతుల రాజయ్య గౌడ్, డైరెక్టర్ లుగా రంగు ఎల్లవ్వ, కోల ప్రభాకర్ గౌడ్, కోల ఉమాకర్ గౌడ్,కోల శ్రీకాంత్ గౌడ్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గీతా పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు కోల రాజు గౌడ్ మాట్లాడుతూ కార్యవర్గం, సభ్యుల సహకారంతో సంఘం ఎదుగుదలకు కృషి చేస్తానని తెలిపారు.

గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి











- సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబొయిన ఎల్లయ్య

నవతెలంగాణ-జగదేవపూర్

'గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి. గ్రామపంచాయతీ కార్మికుల కోరికలు గొంతెమ్మ కోరికలు కావు. గ్రామాలను అద్దంలా తీర్చిదిద్దుతున్న కార్మికులకు 11వ పీఆర్సీ ప్రకారం వేతనాలు అమలు చేయాలి' అని సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య అన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే అధికారుల ప్రజాప్రతినిధుల పర్యటనలో సమావేశాల్లో డప్పులు కొడుతూ నిరసన వ్యక్తం చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు ప్రస్తుతం అనేక గ్రామాల్లో 5000 నుంచి 8000 రూపాయలు మాత్రమే వేతనాలు ఇవ్వడం జరుగుతుందని అనేక గ్రామాల్లో ఆరు నుంచి 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని అన్నారు 11వ పిఆర్సి ప్రకారం 19500 ఈఎస్ఐ పిఎఫ్ 10 లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు చట్టబద్ధంగా జరుగుతున్న సమ్మెపై అధికారుల ప్రజా ప్రతినిధుల వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు నర్సింలు, యాదగిరి, కనకవ్వ, నాగరాజు, శ్రీనివాస్, రవి ,తిరుపతి, రేణుక, లక్ష్మి ,యాదమ్మ పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళవారం 27వ రోజుకు చేరుకుంది. బహుజన సమాజ్ పార్టీ నంగునూరు మండల అధ్యక్షుడు ఖాతా మహేష్ సమ్మెకు మద్దతును ప్రకటించారు. బీఎస్పీ జిల్లా నాయకులు లింగంపల్లి యాదగిరి, సిద్దిపేట అసెంబ్లీ ఇంచార్జ్ బాకూరి అశోక్, అసెంబ్లీ అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్, ప్రధాన కార్యదర్శి ఈర్ల మల్లేశం ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు.గ్రామ పంచాయతీ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 19,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికి 10 లక్షల బీమా, ఆదివారాలు, సెలవు దినాలను ప్రకటించాలని, వారు చేస్తున్నటువంటి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరారు.బహుజన సమాజ్ పార్టీ నంగునూరు మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్ ల ను నెరవేర్చాలని ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు.

నవతెలంగాణ-గజ్వేల్

తమ సమస్యల పరిష్కారం కొరకు గ్రామపంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మె 27రోజు కు చేరుకుంది. గజ్వేల్ ఐఓసీ వద్ద జరుగుతున్న గ్రామపంచాయతీ కార్మికుల సమ్మెలోసీ ఐ టీ యూ జిల్లా నాయకులు వెంకట చారి పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గత 27 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే అంతవరకు సమ్మె కొనసాగుతుంది అన్నారు. ఏళ్ల తరబడి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించి వెంటనే రాష్ట్ర ప్రభుత్వం వారిని పేర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలన్నారు. 27 వ రోజుకు కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, బెజగామ స్వామి, నాంపల్లి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -గజ్వేల్

గ్రామపంచాయతీ కార్మికుల వేతనాల పెంపు కోసం వచ్చిన జీవో నెంబర్ 60ని పకడ్బందీగా అమలు చేయాలని గజ్వేల్ ప్రజాసంఘాల నాయకులు మైసరాములు, చిప్పల యాదగిరి, నిరుడు స్వామి, కొడకండ్ల నర్సింలు తెలిపారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో గ్రామపంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు వారు సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులపై పని భారం పెంచే జీవో నెంబర్ 51 మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని వారు కోరారు. కనీస వేతనం ఇవ్వాలని గ్రామపంచాయతీ జేఏసీని చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని వారు కోరారు. 27రోజులుగా జీపి కార్మికులు సమ్మెలో ఉంటే ప్రభుత్వం పట్టనట్లుగా వ్యవహరిస్తున్నదని అన్నారు. కార్మికులను పర్మినెంట్ చేయాలని వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి గతంలో అసెంబ్లీ సాక్షిగా చెప్పిన మాటలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎండా వాన చలిలో కష్టపడి పల్లెల్లో ప్రజలకు ప్రత్యక్ష సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల అత్యధికులు దళితులు కావడం వల్లే ప్రభుత్వం వివక్ష పాటిస్తుందన్నారు. జీవో నెంబర్ 51 ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని తీసుకొచ్చి కార్మికులకు పని భారాన్ని పెంచడం సరైంది కాదన్నారు. వేతనాలు పెంచమంటే పని భారం పెంచుతారా అని ప్రశ్నించారు. ప్రమాదవశాత్తు కార్మికులు మరణించిన కనీస ఎక్స్ గ్రేషియా ప్రభుత్వం ఇవ్వలేకపోవడం దారుణం అన్నారు. కనీస ప్రాథమిక హక్కుగా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం అన్యాయమన్నారు. కరోనా వంటి కష్టకాలాల్లో ప్రజలని తమ ప్రాణాల్ని ఫణంగా పెట్టి ఆదుకున్న పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించడం సరైనది కాదన్నారు. కేంద్ర బిజెపి సర్కార్ నేడు టెంట్ల వద్ద మద్దతు ఇచ్చినప్పటికీ అసలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాల రాసి కార్పొరేట్లకు ఉపయోగపడే నాలుగు లేబర్ కోడ్లను తెచ్చి కార్మికుల పొట్టలు కొట్టి కార్పొరేట్లకు మేలు చేస్తుందన్నారు 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచిన ఘనత బిజెపి సర్కార్ దేనని విమర్శించారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జిపి జేఏసీ ని చర్చలకు ఆహ్వానించి సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు అనిల్. రాజయ్య. చంద్రం. యాదగిరి. రాజు. కుమార్. దేవేందర్. మహిళలు రాజమణి రాఘవ బాలమణి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సిద్దిపేట అర్బన్

మంత్రి మండలి సమావేశంలో గ్రామ పంచాయతీల సమస్యలును చర్చించకపోవడం దుర్మార్గమైన చర్యని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ అన్నారు. సిద్దిపేట ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులు 27 రోజుకుచేరుకున్న సమ్మెలో భాగంగా వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవి కుమార్ మాట్లాడుతూ అట్టడుగు బలహీన వర్గాల ప్రజలు అని పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పట్టించుకోకపోగా కనీసం మంత్రిమండలి సమావేశంలో అంశాలను పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాల్సిన ప్రభుత్వం వారి శ్రమను గుర్తించకపోవడం వారిని కించపరచడమే అవుతుందని దళితులు బలహీన వర్గాల ప్రజలు అంటే ఈ ప్రభుత్వానికి చిన్నచూపు అని చెప్పేసి ఆయన ప్రశ్నించారు ఇప్పటికైనా వారి సమస్యలు పరిష్కరించకపోతే వర్షాకాల అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ వంటావార్పు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం సంజీవ్ కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు యాదగిరి, రాయ నర్స్, మల్లయ్య,ఎల్లయ్య,యాదగిరి,రాజయ్య పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం వెంటనే అందించాలి



నవతెలంగాణ-మద్దూరు

అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం అందించాలని అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు కూలిపోయిన ప్రజలకు వెంటనే నష్టపరిహారం చెల్లించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మద్దూరు జడ్పిటిసి గిరి కొండల్ రెడ్డి అన్నారు. దూల్మిట్ట మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ముందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తహసిల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమానికి జడ్పిటిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అకాల వడగండ్ల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందిస్తానని చెప్పి 15వేల కోట్ల నష్టం జరిగినట్లు నివేదికలు తయారు చేసి మంత్రివర్గ సమావేశంలో పంట నష్టానికి 500 కోట్లు కేటాయించడం సిగ్గుచేటని ఆయన అన్నారు,అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు కోల్పోయిన బాధితులను ప్రభుత్వం పరామర్శించిన దాఖలాలు లేవని ఆయన అన్నారు. ఇండ్లు కోల్పోయిన వారికి వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సీఎం కేసీఆర్ కు ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకు వస్తారని ఆయన అన్నారు.9 ఏళ్లలో ప్రజా సమస్యలు పట్టించుకున్న పాపాన పోలేదని ఆయన అన్నారు.పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం ఆదుకోవాలని లేనిపక్షంలో రైతులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాలరాజు యాదవ్,కాంగ్రెస్ నాయకులు కనక రాములు,జెల్లా శ్రీనివాస్, సాగర్, నరేష్, అజయ్, బాలయ్య, యాదయ్య, రైతులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కామ్రేడ్ కృష్ణమూర్తి ఆశయ సాధన కోసం పోరాడాలి



- సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో

నవతెలంగాణ-చేర్యాల

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు కామ్రేడ్ కాసం కృష్ణమూర్తి ఆశయ సాధన కోసం సీపీఐ(ఎం), వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు పోరాడాలని సీపీఐ(ఎం) చేర్యాల మండల కార్యదర్శి కొంగరి వెంకట మావో పిలుపునిచ్చారు. కామ్రేడ్ కాసం కృష్ణమూర్తి 17వ వర్ధంతి సందర్భంగా మంగళవారం చేర్యాల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట మావో మాట్లాడుతూ కృష్ణమూర్తి తన బాల్యం నుండే నైజాం రజాకార్లకు, నాటి భూస్వాములకు వ్యతిరేకంగా దున్నేవానికే భూమి కావాలని, భూమి పంచాలి, కూలి పెంచాలనీ, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచి, కౌల్దార్ రక్షణ చట్టం ద్వారా కౌలు రైతులకు గిరిజనులకు, లంబాడీలకు సొంత భూమి దక్కే విధంగా పోరాటం చేసిన యోధులని అన్నారు. కృష్ణమూర్తి స్ఫూర్తితో నే టి ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కూలీలకు కూలి రేట్లు పెంచాలని, పట్టాలు లేకుండా ఏళ్ల తరబడి నేటికీ భూములను కాస్తు చేస్తున్న పేద రైతులందరికీ పట్టా పాస్ బుక్కులు వచ్చేంతవరకు పోరాడాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో ఉన్న మిగులు, పంచరాయి, పోరంబోకు, ప్రభుత్వ భూములను భూమిలేని పేదలకు, ఇంటి స్థలాల కోసం, పంచే విధంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, పార్టీ చేస్తున్న పోరాటాలను మరింత బలోపేతం చేసి కామ్రేడ్ కృష్ణమూర్తి గారి ఆశయాన్ని సాధించేందుకు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాళ్ల బండి నాగరాజు, పోలోజు శ్రీహరి, గర్నపల్లి చంద్రం, యాడారం బ్రహ్మయ్య రమ, లావణ్య పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి దళితబంధు



- ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం లో ఉన్న ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు అందిస్తామని ఎఫ్ డి సి చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం వర్గల్ మండలం సింగాయిపల్లి గ్రామ కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు భారత రాష్ట్ర సమితి పార్టీలో చేరగా వారికి పార్టీ కండవవేసి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని అవంతరాలు వచ్చినా దళిత బంధు పథకం ప్రతి ఇంటికి చేరుతుందని ప్రతిపక్షాలు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే గజ్వేల్ నియోజకవర్గం రోల్ మోడల్ గా మారుతుందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కెసిఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారని ఆయన తెలిపారు. దళితులను ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా మరింత బలోపేతం చేసేందుకు కేసిఆర్ కృషి చేస్తున్నారన్నారు. మంత్రి హరీష్ రావు కృషితో గజ్వేల్ అంచలంచలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెంకటరెడ్డి, సింగల్ విండో చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాల్రెడ్డి, సీనియర్ నాయకులు నాగరాజు, గ్రామ సర్పంచ్ వేణు, వి పి ఆర్ మీడియా ఇన్చార్జి హైమద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సంబరాలు



నవతెలంగాణ-సిద్దిపేట

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ను ప్రభుత్వంలో విలీనం చేసినందుకుగాను ఆర్టీసీ సిబ్బంది ఆర్టీసీ డిపో ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్ రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు సిబ్బంది కోరిక మేరకు సీఎం కేసీఆర్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, దీంతో కార్మికులకు లబ్ధి చేకురుతుందని అన్నారు. అనంతరం కార్మికులు నృత్యాలు చేస్తూ , స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

టెకేదార్ లకు జీవన భృతి ప్రకటన పై హర్షం వ్యక్తం చేసిన కార్మిక విభాగం

రాష్ట్ర సీఎం కేసీఆర్ టెకేదార్ లకు జీవన భృతి కోసం ఆసరా పెన్షన్ ఇస్తానని నిన్న జరిగిన క్యాబినెట్ మీటింగ్ లో తీర్మానం చేశారని, ఈ తీర్మానానికి సహకరించిన ఆర్థిక , వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకి బీడీ టేకేదారులు తరఫున, రాష్ట్ర బీడీ సంఘం తరఫున వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు మంచే నర్సింలు తెలిపారు. దేశాయ్ బీడీ ఆఫీస్ ముందు సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ టేకిదారుల సంఘం అధ్యక్షులు మోహన్ రెడ్డి, సూరం భాస్కర్, బాలు, చేకార్స్, బీడీ టేకు దారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు



నవతెలంగాణ - సిద్దిపేట

అథ్లెటిక్స్ క్రీడల్లో రాణించి వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువ ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ అన్నారు. మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి హరీష్ రావు ప్రోత్సాహంతో గత సంవత్సరం మా అథ్లెటిక్స్ క్రీడాకారులు 19 మంది ఆర్మీకి ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివై ఎస్ ఓ నాగేందర్, ఎస్ జి ఎఫ్ సెక్రటరీ పన్యాల రామేశ్వర్ రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారుపల్లి శ్రీనివాసులు, రెజ్లింగ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కడకంచి ఉప్పలయ్య , జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్, సంఘం బాధ్యులు బయ్యారం కనక రెడ్డి, కృష్ణ కుమార్, నిశాంక్ గౌడ్, సాయి కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు .

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

అండర్ 14 బాలుర విభాగంలో జి వెంకటేష్, ఎస్ రాహుల్, గణేష్, కే శివకుమార్, బాలికల విభాగంలో ఎస్ మౌనిక, కావ్య, పి వెన్నెల, మధుప్రియ, అండర్ 16 బాలుర విభాగంలో వి వెంకటేశ్వర్లు, ఎం వంశీ, అజయ్, అభిరామ్, ఎస్ అరవింద్, బాలికల విభాగంలో టి శ్రీలత, బి సంధ్య, అండర్ 18 బాలుర విభాగంలో పి లక్ష్మన్, బి లావణ్య, డి రేణుక, వి రేఖ, అండర్ 20 బాలుర విభాగంలో జి లీలా ఆనంద్, టి వినయ్ కుమార్, రమేష్, బాలికల విభాగములో అంజలి, కల్పన, పి రామ్, ప్రశాంత్ ఎంపిక య్యారని జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామి గౌడ్ తెలిపారు. మీరు ఈనెల 7న హనుమకొండ లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు

నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం



నవతెలంగాణ-తొగుట

బీఆర్ఎస్ ప్రభుత్వం నీరు పేదలకు అండగా ఉంటుందని సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సిరినేని గోవర్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలం లోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో ఎంపీటీసీ వేల్పుల స్వామి కలిసి గ్రామానికి చెందిన అనిత శ్రీనివాస్‌కు రూ.16 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అంద జేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఎంపీ, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొత్త ప్రభాకరరెడ్డి సహకారంతో గ్రామానికి చెందిన చేత్రి అనిత శ్రీనివాస్ కు సీఎం రిలీఫ్ ఫండ్ అందజేశా మన్నారు. సీఎం కెసిఆర్,ఎంపీ కెటపిఆర్ కు ప్రత్యేక అభినందనలు తెలియ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిరినేని గోవర్ధన్ రెడ్డి ఎంపీటీసీ కోఆప్షన్ సభ్యులు కలిమొద్దిన్,నాయకు లు రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-చేర్యాల

ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల వరదలలో సర్వం కోల్పోయిన భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామ నిర్వాసితులకు సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రూ. లక్ష 20 వేల రూపాయల నగదు, 5 క్వింటాళ్ల బియ్యం, 500 బిస్కెట్ ప్యాకెట్లు, 15 మ్యాటులు, 50 కిలోల మిక్చర్ ప్యాకెట్లను మంగళవారం మోరంచపల్లి గ్రామానికి వెళ్లి 100 కుటుంబాలకు 10 రోజులకు సరిపడా బియ్యం, కిరాణం, కూరగాయలు అందజేశారు. కార్యక్రమంలో మోరంచపల్లి గ్రామ సర్పంచ్ కమల, చేర్యాల పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు నీల శివకుమార్, యువజన విభాగం అధ్యక్షులు అయిత సంపత్ కుమార్, గందె వేణుగోపాల్, అయిత బాల శంకర్, సేవా భారతి బొడిగం సిద్దారెడ్డి, చిరంజీవి, పచ్చిమడ్ల సాయి పాల్గొన్నారు.

మర్కుక్ ఎస్ఐని కలిసిన గణేష్‌పల్లి సర్పంచ్



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ నూతన ఎస్ఐగా డి.శంకర్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం గణేష్ పల్లి సర్పంచ్ మెతుకు మంజుల శ్రీరాములు , మర్యాద పూర్వకంగా కలసి కలసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేష్,నాయకులు పూడెం రాంరెడ్డి, బీంరాజు, తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ పేద ప్రజలకు వరం



నవతెలంగాణ-తొగుట

కెసిఆర్ సారధ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడతాయని వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అన్నారు.మంగళవారం మండలం తుక్కాపూర్ గ్రామానికి బోయిని బాలరాజు రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు.అనంత రం ఆయన మాట్లాడుతూసీఎం కెసిఆర్ సారధ్యం లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడతాయ ని తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్ర మంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకు లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు వంగ కనకయ్య,ఉప సర్పంచ్ లింగా ల శ్రీలత స్వామి పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత



నవతెలంగాణ-మర్కుక్

ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేద ప్రజలకు ఎంతో తోడ్పాటునిస్తుందని గంగాపూర్ యూసుఫ్ ఖాన్ పల్లి గ్రామ ఉపసర్పంచి జగదీష్ సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని గంగాపూర్- యూసుఫ్ ఖాన్ పల్లి గ్రామానికి చెందిన నాచోనియా హిరామన్ సింగ్ కు రూ. 60 వేల సీఎం సహాయ నిధి చెక్కును గ్రామ బీఆర్ఎస్ నాయకులతో కలిసి బాధితునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో రఘువీర్ సింగ్, రామ్ సింగ్, పాండు సింగ్, కుశాల్ సింగ్, జై సింగ్, శంకర్ సింగ్, రామ్ సింగ్, తదితరులున్నారు.

రెవెన్యూ డివిజన్ సాధన కోసం ఐక్యంగా పోరాడాలి

- జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్య గౌడ్



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ పోరాడాలని జేఏసీ చేర్యాల మండల కన్వీనర్ బొమ్మగోని అంజయ్య గౌడ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కడవేరుగు గ్రామంలో మంగళవారం జరిగిన జేఏసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న చేర్యాల నుండి సిద్దిపేట వరకు బైక్ ర్యాలీ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జేఏసీ కడవేరుగు గ్రామ కమిటీ ఎన్నుకున్నారు.గ్రామ కన్వీనర్ గా మడికొండ బాపురాజు, కో కన్వీనర్లుగా మర్యాల సత్తయ్య, చల్ల బాల్ రెడ్డి, పిట్టల సురేష్, కార్యదర్శిగా కొమ్ము లచ్చయ్య, సహాయ కార్యదర్శిగా జల్లి నాగరాజు, కోశాధికారిగా పానుగంటి శ్రీనివాస్ రెడ్డి, మొత్తం 20 మందితో ఏకగ్రీవంగా కమిటీ ఎన్నికైనట్లు అంజయ్య గౌడ్ ప్రకటించారు.

హరిత దుబ్బాకకు నాటండి రెండేసి మొక్కలు



నవతెలంగాణ-దుబ్బాక

పురపాలికను హరిత దుబ్బాక గా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో ఇంటికి రెండేసి చొప్పున మొక్కలు నాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమిరెడ్డి కోరారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.పట్టణ కేంద్రంలోని 17వ వార్డులో కౌన్సిలర్ పులిగారి కల్పన ఎల్లంతో కలిసి చైర్ పర్సన్ వనిత ఇంటికి రెండేసి చొప్పున మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడారు. కాలుష్య తీవ్రతను అరికట్టడమే కాకుండా పర్యావరణాన్ని కాపాడేందుకు పుర ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేష్ రెడ్డి,వర్క్ ఇన్స్పెక్టర్ బి ప్రవీణ్ కుమార్,ఇన్చార్జ్ శానిటరీ ఇన్ స్పెక్టర్ యం.దిలీప్ కుమార్,ఆర్పి లు ఉన్నారు.

కల్యాణలక్ష్మితో శుభపరిణామం



నవతెలంగాణ-నంగునూరు

పేద కుటుంబాల పెళ్లికి కల్యాణలక్ష్మీ చెక్‌లు అందించడం శుభపరిణామమని తహశీల్దార్ దిలీప్ నాయక్ తెలిపారు. మంగళవారం నంగునూరు తహశీల్దార్ కార్యాలయంలో సిద్దన్నపేట గ్రామానికి చెందిన తల్లిదండ్రులు బెజగాం రమాదేవి- సత్యంల కుమార్తె లాస్యశ్రీ కళ్యాణ లక్ష్మీ చెక్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమంతుల వెంకటేశం, ఎంపీటీసీ బెదురు తిరుపతి, నాయకులు డాకూరి భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఇంటింటికి మొక్కల పంపిణీ



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న మంగళవారం 12వ, 13వ వార్డులలో ఇంటింటికి మొక్కల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 9వ విడత హరితహారం లో పంపిణీ చేస్తున్న మొక్కలను బాగా పెంచాలని , పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఇంట్లో ఉన్న తడి చెత్త తో ఎరువు తయారు చేయాలని ,తయారైన ఎరువును మొక్కలకు వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ ఐలేని అనిత రెడ్డి , కమిషనర్ రాజశేఖర్ , కౌన్సిలర్స్ గుళ్ళ రాజు ,బొల్లి కల్పన , ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవికుమార్ , వార్డ్ ఆఫీసర్ సహదేవ్,ప్రశాంత్, మెప్మా రిసోర్స్ పర్సన్స్ సరళ, యశోద పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు సభ్యులు దోమ జహంగీర్ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న గజ్వేల్ మాజీ శసనసభ్యుడు తూంకుంట నర్సారెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాజీ పిఏసీఎస్ చైర్మన్ నరేందర్ రెడ్డి,స్థానిక సర్పంచ్ లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి, అమర రాము,పాషాబాయ్, అజీజ్,బాబు,అబ్బు తదితరులు ఉన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

- గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

నవతెలంగాణ-గజ్వేల్

తెలంగాణ క్యాబినెట్ సమావేశంలో ఆర్టీసీ విలీనం,అనాథలను ఆదుకోవడం వంటి నిర్ణయాలతో మరోసారి ముఖ్యమంత్రి కేసిఆర్ పేదల పక్షపాతిగా నిరూపించుకున్నరని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలతో నష్టపోయిన రైతాంగాన్ని,ప్రజానీకాన్ని ఆదుకునేందుకు తక్షణ సాయం కింద 500 కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం వరద బాధిత ప్రజానీకానికి ఎంతో స్వాంతనని,మనోధైర్యాన్ని అందిస్తుందన్నారు.వరదలతో నష్ట పోయిన తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరీ చేసి ఆదుకోవాలని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలపడం ఎంతో సంతోషం



కల్గించిందని అన్నారు. సమావేశంలో భారస మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజి కో ఆప్షన్ అహ్మద్, ఆత్మకమిటి డైరెక్టర్ మధుసూదన్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శివకుమార్, గాలేంక శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రఘునందన్‌రావు ఒత్తిడితోనే ఖాళీల భర్తీకి ఉత్తర్వులు

నవతెలంగాణ- దుబ్బాక

'ఇన్నేళ్లుగా దుబ్బాక ఏలింది బిఆర్ఎస్ పార్టీ నాయకులే కదా మీరు నిజాయితీగా పని చేసి ఉంటే ఎందుకు గెలవలేదు. నేడు ఈ వ్యవస్థ ఉండేది కాదు కదా' అని బిజెపి రాష్ట్ర కార్యదర్శి అంబటి బాలేష్ గౌడ్ ప్రశ్నించారు. ఎమ్మెల్యే రఘునందన్ రావు ఒత్తిడితోనే ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రిలో ఖాళీ పోస్టుల భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీచేసిందని తెలిపారు. వంద పడకల ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న 71 పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు వెల్లడించిన సందర్భంగా మంగళవారం దుబ్బాక పురపాలిక పరిధిలోని ప్రభుత్వ ఏరియా వంద పడకల ఆసుపత్రి వద్ద బిజెపి శ్రేణుల ఆధ్వర్యంలో ఆసుపత్రి సిబ్బందితో కలిసి ఎమ్మెల్యే రఘునందన్ రావు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు.బిఆర్ఎస్



ఎమ్మెల్యే ఉన్నప్పుడు దుబ్బాక అభివృద్ధికి నోచుకోలేదని, రఘునందన్ రావు గెలిచాకే అభివృద్ధిలో పరుగులు పెడుతుందని స్పష్టం చేశారు.బిజెపి సీనియర్ నాయకులు కిష్టమ్మగారి సుభాష్ రెడ్డి,సుంకోజి ప్రవీణ్ కుమార్, పాల్గొన్నారు.

గజ్వేల్ బస్టాండ్ పనుల కోసం షెడ్డు తొలగింపు

నవతెలంగాణ- గజ్వేల్

నియోజకవర్గ కేంద్రం గజ్వేల్ పట్టణంలో తాత్కాలిక బస్టాండ్‌ను మంగళవారం సంబంధిత కాంట్రాక్టర్ తొలగించారు. శాశ్వత బస్టాండ్ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు సూచన మేరకు గజ్వేల్ బస్టాండ్ పనులు రాబోయే మూడు నాలుగు నెలలు బస్టాండ్ పూర్తి చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో బస్టాండ్ పనులకు మోక్షం కలుగుతుంది. గజ్వేల్, ప్రజ్ఞాపూర్ పట్టణాల్లో రెండు బస్టాండ్లను నిర్మించాలని మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేశారు. నాలుగు కోట్ల రూపాయలతో గజ్వేల్ బస్టాండ్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. మరో నాలుగు కోట్లతో ప్రజ్ఞాపూర్ లో బస్టాండ్ నిర్మాణం ప్రారంభమైంది. స్లాబ్ లెవల్ వరకు పనులు కొనసాగుతున్నాయి. కాగా గజ్వేల్ బస్టాండ్లో నిర్మాణ పనులను కూడా ప్రారంభించాలని సంబంధిత శాఖ



అధికారులు భావించిన తరుణంలో తాత్కాలి బస్సు సెంటర్ ను తొలగించారు. ప్రస్తుతం బస్సులు వెజ్ నాన్వెజ్ మార్కెట్, ఇంద్ర పార్క్ చౌరస్తా తదితర చోట్ల బస్సులు నిలుపుకొని ప్రయాణికులు ఎక్కించుకుంటాయి. బస్టాండ్ నిర్మాణం పూర్తి అయ్యేవరకు ప్రయాణికులు సహకరించాలని కోరారు.

ఇస్నాపూర్ వరకు మెట్రో రైల్ పొడిగింపుపై హర్షం

- సంగారెడ్డి వరకు మెట్రో సదుపాయం కల్పించాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో మియాపూర్ నుండి సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వరకు మెట్రో రైల్ సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించడం పట్ల సీపీఎం సంగారెడ్డి జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ మాట్లాడుతూ మెట్రో సదుపాయం సంగారెడ్డి పట్టణం వరకు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మియాపూర్ నుండి సంగారెడ్డి వరకు మెట్రో రైల్ సదుపాయం కల్పించాలని గతంలో పటాన్చెరు నుండి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు సిపిఎం ఆధ్వర్యంలో మహా పాదయాత్ర నిర్వహించినట్లు గుర్తు చేశారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్కు అతి దగ్గరగా



సంగారెడ్డి పట్టణం ఉందన్నారు. ప్రజలు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు, తదితర రంగాల ప్రజలు నిత్యం హైదరాబాదుకు ప్రయాణాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజా రవాణా మరింత సౌకర్యవంతంగా ఉండడానికి మెట్రో ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమెల మానిక్, జిల్లా కమిటీ సభ్యులు నర్సింలు నాయకులు అశోక్, రమేష్ గౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌కు వంగ నాగిరెడ్డి

నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట కు చెందిన రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లనున్నారు. తెలంగాణలోని హార్టికల్చర్ శాఖకు చెందిన దాదాపు 30 మంది ప్రతినిధుల బృందం ఇజ్రాయెల్ లో పర్యటించనుంది. ఆ దేశంలో వ్యవసాయంలో కొత్త పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం గురించి అధ్యయనం చేసేందుకు ఈ బృందం ఆగస్టు 5 నుండి 10 వరకు ఐదు రోజుల పాటు పర్యటించనుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ సెక్రటరీ రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బృందానికి ఉద్యానవన శాఖ డైరెక్టర్ హన్మంతరావు నాయకత్వం వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యానవన సలహాదారు డాక్టర్ శ్రీనివాస్ రావు సాంకేతిక సమన్వయం చేస్తారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా నుండి రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి కూడా వెళ్లనున్నారు.



కుర్రకు ఎమ్మెల్సీ ఇవ్వడం పట్ల హర్షం

నవతెలంగాణ- గజ్వేల్

గవర్నర్ కోట ఎమ్మెల్సీగా కుర్ర సత్యానారాయణకు ఎంపిక చేసినందుకు గజ్వేల్ ఏకలవ్య ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మిఠాయిలు పంచుకొని సంబరాలు చేసుకోవడం జరిగింది. ఎమ్మెల్సీగా ఎరుకల కులానికి చెందిన సత్యానారాయణ అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రివర్యులు హరీష్ రావు,మంత్రి కేటీఆర్ కి కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో 7వ వార్డు కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్ గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ



డైరెక్టర్ శీలసారం ప్రవీణ్ , ఎస్టీ సెల్ అధ్యక్షులు కూరాకుల వెంకట సాయి , సహకార సంఘం అధ్యక్షులు ఆంజనేయులు , కురాకుల మల్లేశం, చిలసారం మల్లేశం,రమేష్, నర్సింలు, మహేందర్, వాల్మీకి, కూతాడి వెంకటేష్, కూతాడి మధు, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.

తడ్కల్‌కు బస్సు ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నారాయణఖేడ్

నారాయణఖేడ్ నుండి కంగ్టి మండలం తడ్కల్‌కు మంగళవారం ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి మాట్లాడుతూ.... ఎనుకబడ్డ తడ్కర్ ను అన్నిరంగల్లో అభివృద్ధి చేస్తామన్నారు. తడ్కర్ కు సౌకర్యం లేక ఆ మధ్యలో గల గ్రామాల ప్రజలు,విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి సారధ్యంలో నియోజకవర్గంలో నూతన రోడ్ల నిర్మాణం జరిగి ప్రయాణాలు సులువైన సమయాన తడ్కల్ నుండి ఖేడ్ కు బస్సు ను ప్రారంభించరు. బస్సు ఏర్పాటు చేయటంతో విద్యార్థులు,స్థానికులు,పరిసర ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యం బి ఆర్ ఫౌండేషన్ ఛైర్మెన్ మహారెడ్డి భూపాల్ రెడ్డి,ఎంపీపీ సంగీత వెంకట్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు గంగారాం,మేనేజర్ మలేశయ్య, మార్కెటింగ్ మేనేజర్ పాండు,సర్పంచ్ మనోహర్,మాజీ సర్పంచ్ నారాయణ,తదితర గ్రామాల సర్పంచ్ లు,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అధిక వర్షాలతో నర్సరీలో జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-మర్కుక్

గత 15 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నర్సరీలో ఉండే చిన్న మొక్కలు దెబ్బతినే అవకాశం ఉన్నందున నిర్వాహకులు జాగ్రత్తలు పాటించాలని సర్పంచ్ భాస్కర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ నర్సరీ ని మండల వ్యవసాయాధికారి టి. నాగేందర్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల నర్సరీ లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిర్వాహకులకు. సూచించారు. ఈ కార్యక్రమంలో నర్సరీ నిర్వాహకులు గ్రామస్తులకు తదితరులున్నారు.

నట్టల నివారణ మందు పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం గట్లమల్యాల పశువుల హాస్టల్ పశువులకు ఉచితంగా నట్టల నివారణ మందు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ నరేష్ మాట్లాడుతూ వానకాలంలో పశువులకు రోగాలు రాకుండా కాపాడుకునేందుకు ఈ మందు దోహదపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది బుద్ధి యాదగిరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్ పేట ఎస్సైగా మోహన్ రెడ్డి



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం రాజగోపాల్ పేట ఎస్సైగా మోహన్ రెడ్డి మంగళవారం పదవి భాధ్యతను చేపట్టారు. మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ నుండి రాజగోపాల్ పేట పోలీస్ స్టేషన్ కు బదిలీ పై వచ్చారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన ఎస్సై ఎల్.రాజు గౌడ్ కరీంనగర్ కమీషన్ రేట్ కు బదిలీ పై వెళ్లారు.

అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రయోగ పరీక్షల రీ షెడ్యూల్

నవతెలంగాణ - సిద్దిపేట

వర్షాల కారణంగా జులై 20,21 తేదీలలో జరుగవలసిన డిగ్రీ రెండవ సంవత్సర 4 వ సెమిస్టర్ ప్రయోగ పరీక్షలు ఈ నెల 03,04,05న నిర్వహిస్తామని రీజనల్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె మధుసూదన్ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, రవాణా సదుపాయం ఇబ్బందిగా మారిన నేపథ్యంలో పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు తెలిపారు .

ఏకలవ్యలకు సీఎం కేసీఆర్ పెద్దపీట



నవతెలంగాణ -గజ్వేల్

తెలంగాణ రాష్ట్రంలో ఏకలవుకు ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని గజ్వేల్ ఆత్మ కమిటీ డైరెక్టర్ కూరాకుల సాయి అన్నారు. మంగళవారం సంగారెడ్డి మాజీ కుర్ర సత్యనారాయణకు ఎమ్మెల్సీ గవర్నర్ కోటలో ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రతిపాదించడం పైట్ల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సత్యనారాయణ ఇంటిలో కలిసి సన్మానం చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏకలవులకు అన్ని సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గజ్వేల్ పట్టణంలో సైతం అన్ని పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన గుర్తు చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ సామాజిక వర్గం భారత రాష్ట్ర సమితి పార్టీకి అండగా ఉంటుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో గజ్వేల్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు చిలసారం గాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు కొండంసంపత్ రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు, ఆయన శ్రేయోభిలాషులు ఘనంగా నిర్వహించారు. నాలుగో వార్డ్ లోనే హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. కేకును కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సంపత్ రెడ్డిని గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వివిధ రంగాల నాయకులు అరవింద రెడ్డి, మిద్దె రవి, సాయి, శ్రీనివాస్, దుబాల శ్రీశైలం, పరశురాములు, ప్రశాంతు, సత్యం, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాల సేకరణ

ఏఈఓ మెట్టు ప్రవీణ్



నవతెలంగాణ-దౌల్తాబాద్

మండల పరిధిలోని ముబారస్పూర్ రైతు వేదిక పరిధిలోని మామషాపూర్ గ్రామంలో రైతులు సాగుచేసిన పంట వివరాలను మంగళవారం సేకరించడం జరిగిందని వ్యవసాయ క్షేత్రస్థాయి అధికారి మెట్టు ప్రవీణ్ తెలిపారు. రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజలు ప్రభుత్వం కొనుగోలు చేయాలంటే అన్నదాతలు సాగుచేసిన పంటలను తప్పనిసరిగా వ్యవసాయ శాఖ ఆన్లైన్లో నమోదు చేసుకుంటూ అయితేనే ప్రభుత్వం పంట కొనుగోలు చేయడానికి వీలుగా ఉంటుందన్నారు. రైతు బీమా కోసం అన్నదాతలు ఆగస్టు 5వ తేదీ లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి



నవతెలంగాణ-తొగుట

రైతు బీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి కోరారు. ఈ నెల ఐదవ తేది వరకు పూర్తి వివరాలతో నమోదు చేసుకోవాలన్నారు. రైతు బీమా ఉన్న రైతు మరణిస్తే రైతు కుటుంబానికి పైరవీలకు తావు లేకుండా రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించడం గొప్ప విషయమన్నారు. కరువు కటకాలతో రైతుల ఆర్థనాధాలతో వెలవేలబోయిన తెలంగాణ నేడు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో పచ్చని మాగాణి గామారిందన్నారు.

శ్రీరామ తండాలో శీతల భవాని వేడుకలు



నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీరామ తండాలో మంగళవారం సీతల భవాని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్దలు ప్రత్యేక పూజలు చేసి, నృత్యాలు చేశారు. ప్రతి సంవత్సరం పంట విత్తనాలు వేసే ముందు ఈ పండగ చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దమనిషి బీమా నాయక్, వార్డ్ మెంబర్ సంతోష్ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రవీందర్, బాలు, సంపత్, విజయ్, లచిరం,శ్రీను, రవీందర్, తిరుపతి, జంలాల్, బాసు,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిదిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో మంగళవారం బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు జితేందర్ రెడ్డి పర్యటించారు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఇండ్లు దెబ్బతిన్న బీజేవైఎం ప్రధాన కార్యదర్శి చెక్కల నరసింహులు, బిమరి అశోక్ కుటుంబాలను పరామర్శించారు. వారికి నిత్యావసర సరుకులు అందించారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ఏర్పుల వెంకటరమణ, రాష్ట్ర ఐటీ సెల్ పేర్ల శ్రీనివాస్ జిల్లా ఉపాధ్యక్షులు నందన్ గౌడ్ అధికార ప్రతినిధి గర్నెపల్లి కృష్ణమూర్తి ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం శ్రీధర్ బీజేవైఎం మండల అధ్యక్షులు బిమరి గణేష్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం

అడిషనల్ డీసీపీ మహేందర్

నవతెలంగాణ-తొగుట

విధి నిర్వహణలో బదిలీలు సహజమని అధికారి, ఎక్కడికి వెళ్లినా మంచి పనితీరు కనపర్చి శాఖాపరంగా మంచి పేరు తెచ్చుకోవాలని ఆడిషినల్ డీసీపీ మహేందర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి తొగుట సిఐ కమలాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తొగుట ఎస్ఐ కర్ణాకర్ రెడ్డి, రాయపోల్ ఎస్ఐ షేక్ మహబూబ్ అలీలకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ఎస్ఐ కర్ణాకర్ రెడ్డి,షేక్ మహబూబ్ అలీ సేవలు మరువలేనివన్నారు. వృత్తి ధర్మంతో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యమని ఆయన తెలిపారు. పూర్తిస్థాయిలో సహకారం అందించిన ఏసీపీ రమేష్, సిఐ కమలా కర్, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు కర్ణాకర్ రెడ్డి, మహబూబ్ అలీలు కృతజ్ఞతలు తెలిపారు. తొగుట ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో సభ్యులు ఎస్ఐ కర్ణాకర్ రెడ్డిని శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో సిఐలు కమలాకర్, జాన్ రెడ్డి, జానకి రాంరెడ్డి, తిరుపతి, మండల బీఆర్ఎస్ పార్టీ మండల అధ్య క్షుడు జీడిపల్లి రాంరెడ్డి, సర్పంచ్ బొడ్డు నర్సింలు, యూత్



అధ్యక్షుడు మాదాసు అరుణ్ కుమార్ నాయకులు నర్సింహారెడ్డి, సుభాష్,ప్రెస్ క్లబ్ అధ్య క్షుడు సాయి కుమార్,కృష్ణా గౌడ్,నర్సింలు, షఫీ, నాగార్జునతో పాటు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలపై అవగాహన

నవతెలంగాణ-అక్కన్నపేట

అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామంలోని అంగన్వాడీ సెంటర్లో తల్లిపాలు, పసిపిల్లల పోషణపై మంగళవారం అవగాహన కల్పించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా సూపర్వైజర్ సుజాత హాజరై మాట్లాడుతూ ప్రతి బిడ్డకు తల్లి ఆధారమని, కడుపులో ఉన్నప్పుడు కడుపులో నుండి బయట పడినప్పుడు అన్ని అవసరాలు తీర్చేది తల్లి అని అన్నారు. కడుపులో ఉన్నప్పుడు బిడ్డ శరీర అవయవాలు అభివృద్ధి ఒక విధంగా ఉంటుందని, పుట్టిన తర్వాత అవయవాల అభివృద్ధి మూడు నెలల్లో రెట్టింపు అవుతాయని దీనికి కారణం తల్లిపాలే అని తెలియజేశారు. బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. ఈ ముర్రుపాలు బిడ్డ జీవితంపై ఎంతో ప్రభావాన్ని చూపుతాయని తెలియజేశారు. అనంతరం ఏఎన్ఎం సారమ్మ మాట్లాడుతూ.. గర్భం దాల్చిన వెంటనే మాకు తెలపాలని అన్నారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించుకోవాలని అవి పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని రక్షిస్తాయని తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నార్మల్ డెలివరీలు చేయించుకోవాలని



దానికోసం మేము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, రేణుక, రాజేశ్వరి, ఆశాలు, గర్భిణీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సీఎం గొప్ప నిర్ణయం

తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాప్ రెడ్డి

నవ తెలంగాణ -గజ్వేల్

ప్రభుత్వంలో ఆర్టిసి సంస్థను విలీనం చేయడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారని తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక బస్టాండ్ లో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఆర్టీసీ కార్మికులతో కలిసి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ నుండి ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలందిస్తున్నారని ఆయన చెప్పారు. తెలంగాణ రవాణా సంస్థలు మరింత బలోపేతానికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రానున్న కాలంలో ఆర్టీసీ సమస్త అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యకమంలో మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రాష్ట్ర సమితి నాయకులు కిషన్ రెడ్డి, గుంటుక రాజు, నవాజ్, కార్మిక



సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్, ఎంపీ ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు

నవతెలంగాణ-తొగుట

అభివృద్ధి పతకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయో గ పడుతున్నాయని సర్పంచ్ బొడ్డు నర్సింలు అన్నారు.మంగళవారం చందాపూర్ గ్రామానికి చెందిన గుడ్డోజి శిరీష రూ.8500 సీఎం రిలీఫ్ పండ్ చెక్కును పంపిణీ చేశారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ పార్లమెంట్ సభ్యులు కొత్త ప్రభా కర్ రెడ్డి సహకారంతో గుడ్డోజి శిరీషకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశామన్నారు.బీఆర్ఎస్ ప్రభు త్వం సీఎం కెసిఆర్ చేపడుతున్న పలు పతకాలు పేద ప్రజలకు ఎంతో ఉపయోగ పడుతున్నాయ న్నారు.కావున సీఎం కేసీఆర్,ఎంపీ కెపిఆర్ కు



ప్రత్యేక అభినందనలు తెలియ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యకమంలో మల్లికార్జున తదితరు లు ఉన్నారు.

ఎమ్మెల్యే రఘునందన్ ద్వారానే నియోజకవర్గంలో అభివృద్ధి

నవ తెలంగాణ రాయపోల్



దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు గెలిచిన తర్వాతనే అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని రాయ పోల్ బీజేపీ మండల అధ్యక్షులు మాదాస్ వెంకట్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో గజ్వేల్, సిద్దిపేటకు దీటుగా వంద పడకల ఆసుపత్రి ఉండాలని అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసి ఆసుపత్రి నిర్మాణం చేపట్టిన తర్వాత సరిపడు వైద్య సిబ్బంది నియమించాలని డిమాండ్ చేసింది ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. దాన్లో భాగంగానే ప్రభుత్వం దుబ్బాక ఏరియా ఆసుపత్రికి 71 వైద్య సిబ్బంది పోస్టులు మంజూరు చేశారన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా రోడ్ల మరమ్మతులు ప్రజల సమస్యలు వెంటవెంటనే పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ప్రతినిత్యం ప్రజల మధ్యనే ఉంటున్నారని, దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే రఘునందన్ రావు ద్వారానే అభివృద్ధి జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు.

ఘనంగా శీత్లాభవాని వేడుకలు

నవెతెలంగాణ-కోహెడ

మండలంలోని ఆరెపల్లి గ్రామ చంద్రనాయక్‌తండాలో మంగళవారం ఎంపీపీ కొక్కుల కీర్తి సురేష్, సర్పంచ్ లావుడ్య సరోజన దేవెందర్‌ల ఆధ్వర్యంలో శీత్లాభవాని అమ్మవారి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు సుఖసంతోషాలతో మెదలాలని అమ్మవారిని వేడుకున్నారు. అలాగే వనభోజనాలకు వెళ్ళి అమ్మవారి వద్ద తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, మహిళలు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

